ప్రజా మారుతి
తెలంగాణ జాతీయ దినపత్రిక
ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు



క్రికెట్ ఫ్యాన్స్‌కు పండగే..
ఈసారి నిజామాబాద్‌లో ఐపీఎల్ ఫ్యాన్ పార్క్

ప్రచురణ : జగిత్యాల సంపుటి : 05 సంచిక : 238 పేజీలు : 04 వెల రూ. 2 బుధవారం 25 - 03 - 2026

# హైదరాబాద్ నగరాన్ని అద్భుత నగరంగా తీర్చిదిద్దుదాం

- మంత్రి శ్రీధర్ బాబు
- అందరి సహకారంతో హైదరాబాద్‌ను అద్భుత నగరంగా తీర్చిదిద్దుదాం
- హైదరాబాద్ నగర అభివృద్ధి, ప్రాజెక్టుల అమలుపై అసెంబ్లీలో సుదీర్ఘ చర్చ
- బీఆర్ఎస్ సభ్యుల ప్రశ్నకు మంత్రి శ్రీధర్ బాబు సమాధానం
- మూసీ విషయంలో బీఆర్ఎస్ రాజకీయం చేస్తోందని విమర్శ
- రూ.16 వేల కోట్లతో నగరంలో పనులు
- హెచ్-సిటీ కింద రూ.7,032 కోట్ల అంచనాతో 26 పనులతో పాటు రూ.1,500 కోట్లతో 49 లింక్ రోడ్లు, రూ.7,406 కోట్లతో మూడు ఎలివేటెడ్ కారిడార్లకు ఆమోదం



**హైదరాబాద్ :**

హైదరాబాద్ నగర అభివృద్ధి, ట్రాఫిక్ సమస్యలు, ప్రాజెక్టుల అమలు అంశాలపై శాసనసభలో సుదీర్ఘ చర్చ జరిగింది. ప్రశ్నోత్తరాల సమయంలో బీఆర్ఎస్ సభ్యుల ప్రశ్నకు ముఖ్యమంత్రి తరపున మంత్రి శ్రీధర్ బాబు సమాధానం ఇచ్చారు. హైదరాబాద్ నగరాన్ని అద్భుతంగా తీర్చిదిద్దేందుకు అందరి సహకారంతో కృషి చేస్తామని పేర్కొన్నారు. మూసీ విషయంలో బీఆర్ఎస్ రాజకీయం చేస్తోందని అన్నారు. రూ.16 వేల - మిగతా 2 లో

## ఆంబోతుల కొట్లాటలో సామాన్యులే బలి



- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- గ్యాస్ సిలిండర్ల కొరతను నిరసిస్తూ గన్‌పార్కు వద్ద బీఆర్ఎస్ నిరసన
- గ్యాస్ కొరత లేదని కేంద్రం అబద్ధాలు చెబుతోందని విమర్శ
- పెట్రోలియం శాఖ తమ వద్ద లేదని రాష్ట్ర ప్రభుత్వం తప్పించుకుంటోందని మండిపాటు

**హైదరాబాద్ :**

రాష్ట్రంలో నెలకొన్న గ్యాస్ సిలిండర్ల కొరతను నిరసిస్తూ బీఆర్ఎస్ పార్టీ అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చింది. ఈ క్రమంలో గన్‌పార్కు వద్ద కేటీఆర్ - మిగతా 2 లో

2 లో

## తెలంగాణలో నిలిచిపోయిన రిజిస్ట్రేషన్ల ప్రక్రియ

- సర్వర్లలో సాంకేతిక లోపం
- రాష్ట్రవ్యాప్తంగా నిలిచిపోయిన రిజిస్ట్రేషన్ల ప్రక్రియ
- ఆగిపోయిన స్లాట్ బుకింగ్, చలాన్ల చెల్లింపులు
- ఇబ్బందిపడుతున్న కొనుగోలుదారులు, విక్రేతలు



2 లో

## మోస్ట్ వాంటెడ్ మావోయిస్టు పాపారావు లొంగుబాటు

- బస్తర్‌లో కీలక పరిణామం
- పోలీసులకు లొంగిపోయిన మావోయిస్టు కమాండర్ పాపారావు
- ఆయుధాలతో పాటు 17 మంది అనుచరుల లొంగుబాటు
- బస్తర్‌లో సాయుధ నక్సలిజం అంతమైందన్న ప్రభుత్వం
- ఇక ఇద్దరు అగ్రనేతలు మాత్రమే మిగిలారన్న హోం మంత్రి

## యూఏఈ, సౌదీల నుంచి భారత్‌కు బయల్దేరిన ఇంధన నౌకలు




- ఇరాన్ అనుమతి..
- పర్షియన్ గల్ఫ్‌లో ఉద్రిక్తతల నడుమ భారత్‌కు ఇంధన సరఫరా
- యూఏఈ, సౌదీ అరేబియా నుంచి బయల్దేరిన మూడు ఇంధన నౌకలు
- నౌకలకు పటిష్ట భద్రత కల్పిస్తున్న భారత నౌకాదళం
- నౌకల ప్రయాణానికి ఎలాంటి రుసుము తీసుకోలేదన్న ఇరాన్

**ఢిల్లీ :**

పర్షియన్ గల్ఫ్‌లో ఇరాన్, అమెరికా మధ్య తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ, దేశీయ ఇంధన అవసరాలను తీర్చేందుకు కేంద్ర ప్రభుత్వం పకడ్బందీ చర్యలు చేపట్టింది. క్షిపణులు, డ్రోన్ల దాడులతో అట్టుడుకుతున్న సముద్ర మార్గంలో భారత నౌకాదళం పటిష్ట భద్రత నడుమ మూడు కీలక ఇంధన - మిగతా 2 లో

## మహిళా రిజర్వేషన్లపై కేంద్రం కీలక ముందడుగు

- 50 శాతం పెరగనున్న ఎంపీ సీట్లు!
- మహిళా రిజర్వేషన్ల అమలుకు కేంద్రం సరికొత్త ప్రణాళిక
- లోక్‌సభ సీట్లను 543 నుంచి 816కి పెంచే యోచన
- కొత్తగా పెరిగే 273 సీట్లను మహిళలకే కేటాయింపు
- 2011 జనాభా లెక్కల ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన
- పార్లమెంట్ ప్రస్తుత సమావేశాల్లోనే బిల్లులు ప్రవేశపెట్టేందుకు కసరత్తు



**ఢిల్లీ :**

మహిళా రిజర్వేషన్ల అమలు దిశగా కేంద్ర ప్రభుత్వం కీలకమైన ముందడుగు వేస్తోంది. వచ్చే లోక్‌సభ ఎన్నికల (2029) నుంచి చట్టసభల్లో మహిళలకు మూడో వంతు రిజర్వేషన్లు కల్పించేందుకు అవసరమైన రెండు బిల్లులను ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లోనే ప్రవేశపెట్టాలని భావిస్తోంది. దీని కోసం ప్రభుత్వం ఒక సరికొత్త ఫార్ములాను సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. ఈ ప్రతిపాదన ప్రకారం లోక్‌సభలోని ప్రస్తుత 543 స్థానాలను 50 శాతం పెంచి, మొత్తం 816కి చేర్చనున్నారు. కొత్తగా పెరిగే 273 సీట్లను పూర్తిగా మహిళలకు కేటాయిస్తారు. తద్వారా ప్రస్తుత సిట్టింగ్ ఎంపీలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా మహిళా కోటాను అమలు చేయవచ్చని ప్రభుత్వం యోచిస్తోంది.గతేడాది సెప్టెంబర్‌లో పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో ఆమోదించిన "నారీ శక్తి వందన్ అధినియం" ప్రకారం జనాభా లెక్కలు పూర్తయి, - మిగతా 2 లో




## మాట ఇచ్చాం... మార్పు తెచ్చాం




- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు
- ఉత్తరాంధ్రలో రూ.1.36 లక్షల కోట్ల పెట్టుబడితో ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్
- ఈ పరిశ్రమతో ఉక్కు రంగంలో అగ్రస్థానానికి ఏపీ
- ప్రధాని మోదీ, కేంద్ర ప్రభుత్వ సహకారంతోనే ఇది సాధ్యమైందన్న సీఎం చంద్రబాబు
- గతంలో కబ్జాలు, భయం.. నేడు అభివృద్ధి, భవిష్యత్‌పై భరోసా కల్పించామన్న సీఎం
- ఈ ప్లాంట్‌తో లక్షలాది మంది యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు

**అమరావతి :**

ఏపీలో ప్రతిష్ఠాత్మకమైన ఆర్సెలర్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు నిన్న అనకాపల్లి జిల్లా నక్కపల్లి వద్ద శంకస్థాపన జరగడం తెలిసిందే. దీనిపై సీఎం చంద్రబాబు నేడు సోషల్ మీడియా వేదికగా స్పందించారు. ఉత్తరాంధ్ర భవిష్యత్‌కు ఆర్సెలర్ - మిగతా 2 లో

## రాజధాని అమరావతిలో సీసీ కెమెరాలు తప్పనిసరి

- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు
- వరుస అగ్నిప్రమాదాలపై సీఎం చంద్రబాబు కీలక ఆదేశాలు
- ఏపీ రాజధాని అమరావతిలో వరుస అగ్నిప్రమాదాలు
- డీజీపీ, ఇంటెలిజెన్స్ చీఫ్, గుంటూరు ఎస్పీతో సీఎం చంద్రబాబు ఉన్నతస్థాయి సమీక్ష
- వరుస అగ్నిప్రమాదాల వెనుక కుట్ర కోణంపై సీఎం అనుమానం
- పెట్రోలింగ్, డ్రోన్లతో నిఘా పెంచాలని అధికారులకు ఆదేశం
- అనుమానితులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం



**అమరావతి :**

రాజధాని అమరావతి నిర్మాణ ప్రాంతాల్లో భద్రతను కట్టుదిట్టం చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక ఆదేశాలు జారీ చేశారు. పనులు వేగంగా జరుగుతున్న సమయంలో వరుసగా చోటుచేసుకుంటున్న అగ్నిప్రమాదాల నేపథ్యంలో, ప్రతి నిర్మాణ సంస్థ తమ సామగ్రి నిల్వచేసే యార్డులో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. రాజధానిలో భద్రతా వైఫల్యాలకు ఆస్కారం లేకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని ఉన్నతాధికారులను ఆదేశించారు.కూటమి ప్రభుత్వం ఏర్పడి, రాజధానిలో పనులు ఊపందుకున్న తర్వాత జరుగుతున్న వరుస ఘటనలపై సీఎం చంద్రబాబు తీవ్రంగా స్పందించారు. రాయపూడి వద్ద హెచ్‌వోడీ టవర్ల నిర్మాణం జరుగుతున్న ప్రాంతంలో ఓ సంస్థకు చెందిన పైపులు దగ్ధమైన ఘటనపై సచివాలయంలో డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, ఇంటెలిజెన్స్ చీఫ్ మహేశ్ కుమార్ లడ్డా, గుంటూరు ఎస్పీ వకుళ్ జిందాల్‌తో ఆయన ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. - మిగతా 2 లో

# సంపాదకీయం

## ట్రంప్‌కు జ్ఞానోదయం!



'నీ గురించి నీకు తెలిసి, శత్రువు గురించి కూడా తెలిస్తే వంద యుద్ధాల్లోనైనా ఓటమి ఉండదు. నీ గురించి నీకు తెలిసినా, శత్రువు గురించి తెలియకపోతే మాత్రం ప్రతి విజయం తర్వాతా ఒక ఓటమి తప్పదు' అంటాడు పురాతన చైనా యుద్ధరంగ నిపుణుడు సన్‌జూ. శత్రువు గురించి తెలియటం సంగతలా ఉంచి తన గురించి తనకే తెలియని అయోమయంలో ఉన్న అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌కు గెలుపు రమ్మంటే ఎలా వస్తుంది? ఒమన్ మధ్యవర్తిత్వంలో అమెరికా, ఇరాన్‌ల మధ్య సాగుతున్న చర్చలు ఫలప్రదమయ్యే దశకు చేరాయని ఒమన్‌తో పాటు సాక్షాత్తూ అమెరికా ప్రతినిధి బృందం ప్రకటించిన కొన్ని గంటల్లోనే గత నెల 28న ఉన్నట్టుండి ఇరాన్‌పై యుద్ధ ప్రకటన చేసిన దుస్సాహసి ట్రంప్. తీరా ఇరాన్‌తో రెండురోజులుగా చర్చలు సాగుతున్నాయని, అందు వల్ల యుద్ధానికి అయిదు రోజుల విరామం ఇవ్వదల్చుకున్నామని సోమవారం ఆయన ప్రకటించారు. హార్మూజ్ దిగ్బంధాన్ని 48 గంటల్లో ముగించకపోతే ఇరాన్ మౌలిక సదుపాయ వ్యవస్థలన్నిటినీ నాశనం చేస్తామని శనివారం ప్రకటించిన ట్రంప్ ఇలా యూటర్న్ తీసుకోవటం ఆశ్చర్యకర పరిణామం. ఇరాన్ మతాచార్యుడు అలీ ఖమేనీని హతమార్చటంతో మొదలుపెట్టి అమెరికా, ఇజ్రాయెల్ దేశాలు గత 23 రోజులుగా నరమేధానికి పాల్పడ్డాయి. అన్నిటికన్నా అత్యంత ఘోరమైన ఉదంతం పసిపిల్లలు చదువుకుంటున్న బడిపై క్షిపణి దాడి చేసి 170 మంది ప్రాణాలు తీయడం. ఇక్కడితో ఆగలేదు. ఆ రెండు దేశాలూ క్షిపణులతో పెనువిధ్వంసాన్ని సృష్టించాయి. కొన్ని లక్షల జనావాసాలు ధ్వంసం చేశాయి. ఇరాన్ త్వరలోనే దాసోహం అంటుందని యుద్ధభేరి మోగించే ముందు అవి అంచనా వేసుకున్నాయి. అసలు ఇరాన్ అమ్ములపొదిలో ఆయుధాలేమిటన్న విషయంలోనే వాటికి స్పష్టత లేదు. అది అణ్వాయుధాల తయారీ దిశగా ముందుకెళ్తున్నదని చెప్పిన కారణం బూటకం. అదే నిజమైతే, అసలు దాని జోలికెళ్లడానికే వణికేవారు. ఉత్తర కొరియాను ఏం చేయగలుగుతున్నారు? అసలు ఇరాన్ దగ్గర 4,000 మైళ్ల దూరంలోని లక్ష్యాలను ఛేదించగల క్షిపణులున్నాయన్న సంగతి అది గురిచూసి కొట్టేదాకా తెలియదు. పశ్చిమాసియా కొరివితో తలగోక్కోవటం ట్రంప్‌తోనే మొదలు కాలేదు. ఇరాన్‌లో 1953లో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన మహమ్మద్ మొసాదిఘ్ ప్రభుత్వాన్ని బ్రిటన్‌తో కుట్రపన్ని పడగొట్టిన ఘనుడు నాటి అమెరికా అధ్యక్షుడు ఐసెన్‌హోవర్. ఆ దురంతం తర్వాత ఇరాన్ ప్రజలతో అమెరికాకు సత్సంబంధాలు లేవు. మొసదిఘ్ స్థానంలో వచ్చిన మహమ్మద్ రెజా షా పహ్లవి 25 ఏళ్ల పాటు ఇరాన్ సంపద దోచిపెట్టగా 1979లో ఆ నియంతను జనం తరిమికొట్టారు. నాటి అమెరికా అధినేత జిమ్మి కార్టర్ తమవారిని చెర నుంచి విడిపించటానికి చేసిన యత్నం బెడిసికొట్టింది. ఇక ఇరాక్‌లో 2003లో జార్జి బుష్... 2011లో లిబియా, సిరియాల్లో ఒబామా తలలు బొప్పికట్టించుకున్నారు. పశ్చిమాసియాలో ఏకైక పెత్తందారుగా ఆవిర్భవించాలన్న ఇజ్రాయెల్ కల చాలా పాతది. గత అధ్యక్షులంతా దీన్ని తోసిపుచ్చగా తొలిసారి ట్రంప్ తన సలహాదారుల మాటనూ, నిఘా వర్గాల హెచ్చరికలనూ బేఖాతరుచేసి ఈ దుస్సాహసానికి దిగారు. పర్యవసానంగా అమెరికా కల్పిస్తామంటున్న భద్రత ఉత్త డొల్ల అని గల్ఫ్ దేశాలు గ్రహించాయి. చరిత్రలో ట్రంప్‌కు సాటిరాగల ఒకే ఒకడు నెపోలియన్ బోనపార్టే. యూరొప్‌ను జయించి, రష్యాను సైతం దురాక్రమించాలని 1812లో వెళ్లిన నెపోలియన్ అక్కడి భౌగోళిక స్థితిగతులపై అంచనా లేక ఏకంగా 6 లక్షలమంది సైన్యాన్ని కోల్పోయాడు. అతడి పతనానికి అదే నాంది. ఇంతకూ తాజా ప్రకటనకైనా ట్రంప్ కట్టుబడతారా లేదా అన్నది చెప్పలేం. ఇరాన్ మాత్రం ససేమిరా అంటున్నది. అక్కడ నాయకత్వాన్ని అమెరికా, ఇజ్రాయెల్ దేశాలు తుడిచి పెట్టడంవల్ల ఈ దుఃస్థితి ఏర్పడింది. అయినా ప్రపంచ శాంతిని దృష్టిలో పెట్టుకుని ఒక మెట్టు దిగడానికి ఇరాన్ సిద్ధపడాలి. ఆ దిశగా మధ్యవర్తులు ప్రయత్నించాలి. అటు ట్రంప్ భేషజాలు కట్టిపెట్టాలి. ఇరాన్ దాడుల్లో నష్టపోయిన గల్ఫ్ దేశాలకు నష్టపరిహారం చెల్లించటంతో పాటు, ఇరాన్‌కు కలిగిన నష్టాన్ని కూడా భర్తీ చేస్తేనే ఆ దేశాన్ని ఒప్పించటం సాధ్యమని గ్రహించాలి. ఇప్పటికైనా ఆయన తెలివి తెచ్చుకోవాలి.

## రాజధాని అమరావతిలో సీసీ కెమెరాలు తప్పనిసరి

**మొదటిపేజీ తరువాయి -** ఈ వరుస ఘటనలు ప్రమాదవశాత్తు జరుగుతున్నాయా, లేక వీటి వెనుక కుట్ర కోణం ఏమైనా ఉందా అనే విషయంపై నిగ్గు తేల్చాలని అధికారులను ఆదేశించారు. ఘటన జరిగిన తీరు, అంత త్వరగా మంటలు వ్యాపించడానికి గల కారణాలను ఫోరెన్సిక్ ఆధారాలతో సహా వెలికితీయాలని సూచించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, "రాజధానిలో పెద్దఎత్తున నిర్మాణ పనులు జరుగుతున్నాయి. కోట్ల విలువైన సామగ్రిని నిల్వ చేశారు. ఇలాంటి సమయంలో జరుగుతున్న ఘటనల వల్ల పనులకు అనవసర అడ్డంకులు ఏర్పడతాయి. కాబట్టి పటిష్ఠ చర్యలు తీసుకోవాలి" అని అన్నారు. రాజధాని ప్రాంతంలో అదనపు పెట్రోలింగ్ నిర్వహించాలని, డ్రోన్ కెమెరాల ద్వారా భద్రతను పర్యవేక్షించాలని సూచించారు. నిర్మాణ సంస్థలు కూడా తమ వంతుగా సామగ్రి నిల్వ కేంద్రాల వద్ద వ్యక్తిగత భద్రతా సిబ్బందిని ఏర్పాటు చేసుకోవాలని స్పష్టం చేశారు. అనుమానితుల కదలికలపై నిఘా పెట్టాలని, వారి రాకపోకలను గమనిస్తూ అవసరమైతే ప్రశ్నించాలని ముఖ్యమంత్రి తెలిపారు. రాజధానిలో అలజడి సృష్టించాలని ఎవరైనా ప్రయత్నిస్తున్నట్టు తేలితే ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించవద్దని, అలాంటి వారిపై అత్యంత కఠినమైన చర్యలు తీసుకోవాలని చంద్రబాబు పోలీసు ఉన్నతాధికారులను ఆదేశించారు.

## తెలంగాణలో నిలిచిపోయిన రిజిస్ట్రేషన్ల ప్రక్రియ

**మొదటిపేజీ తరువాయి -** తెలంగాణ రాష్ట్రంలో మంగళవారం ఉదయం నుంచి రిజిస్ట్రేషన్ల ప్రక్రియ నిలిచిపోయింది. ప్రధాన సర్వర్లలో సాంకేతిక సమస్యల కారణంగా రాష్ట్రవ్యాప్తంగా రిజిస్ట్రేషన్ల ప్రక్రియకు ఆటంకం ఏర్పడింది. స్లాట్ బుకింగ్, చలాన్ల చెల్లింపులు పూర్తిగా ఆగిపోయాయి. స్లాట్ బుక్ చేసుకున్నవారు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్లాట్ బుకింగ్, డాక్యుమెంట్ వెరిఫికేషన్, ఈ-కేవైసీ ప్రక్రియతో పాటు అన్ని కార్యకలాపాలు నిలిచిపోయాయి. భూబదలాయింపు రిజిస్ట్రేషన్లు నిలిచిపోవడంతో వినియోగదారులు అవస్థలు పడుతున్నారు. స్లాట్లు బుక్ చేసుకున్నవారు, కొనుగోలుదారులు, విక్రేతలు ఉదయం నుంచి రిజిస్ట్రేషన్ కార్యాలయాల వద్ద పడిగాపులు కాస్తున్నారు. ప్రధాన సర్వర్లలో సాంకేతిక లోపం తలెత్తిన నేపథ్యంలో, అధికారులు సాంకేతిక బృందాలను రంగంలోకి దింపారు. సర్వర్ వ్యవస్థను పునరుద్ధరించేందుకు ప్రయత్నిస్తున్నారు.

## ఆంబోతుల కొట్లాటలో సామాన్యులే బలి



**మొదటిపేజీ తరువాయి -** నేతృత్వంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు గ్యాస్ సిలిండర్ల ప్లకార్డులతో వినూత్నంగా నిరసన తెలిపారు. అంతర్జాతీయ పరిణామాల సాకుతో సామాన్యులకు సిలిండర్లు దొరకకుండా చేస్తున్నారని, గంటల తరబడి క్యూలైన్లలో నిలబడాల్సిన పరిస్థితి దాపురించిందని కేటీఆర్ మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం గ్యాస్ కొరత లేదని అబద్ధాలు చెబుతుంటే, రాష్ట్ర ప్రభుత్వం పెట్రోలియం శాఖ తమ పరిధిలో లేదని తప్పించుకుంటోందని కేటీఆర్ ధ్వజమెత్తారు. వీరిద్దరి వైఖరి "ఆంబోతుల కొట్లాటలో లేగదూడలు బలైనట్లు" సామాన్య ప్రజల పాలిట శాపంగా మారిందని ఎద్దేవా చేశారు. భవిష్యత్తులో గ్యాస్ సిలిండర్ బరువును 14 కిలోల నుంచి 10 కిలోలకు తగ్గించే ఆలోచనలో ప్రభుత్వం ఉందని, ఇది ప్రజల జేబులకు చిల్లు పెట్టడమేనని ఆయన ఆరోపించారు. గ్యాస్ సరఫరాపై నెలకొన్న అయోమయాన్ని తొలగించేలా ప్రభుత్వం తక్షణమే శ్వేతపత్రం విడుదల చేయాలని, కేంద్రం వెంటనే జోక్యం చేసుకుని కొరత తీర్చాలని డిమాండ్ చేశారు.

# మాట ఇచ్చాం... మార్పు తెచ్చాం



**మొదటిపేజీ తరువాయి -** మిట్టల్ స్టీల్ ప్లాంట్ ఓ దిక్సూచి అని అభివర్ణించారు. డబుల్ ఇంజన్ సర్కారుతోనే అతిపెద్ద స్టీల్ ప్లాంట్ సాధ్యమైందంటూ ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలిపారు. "మాట ఇచ్చాం... మార్పు తెచ్చాం. ప్రజలు ఇచ్చిన అధికారంతో ప్రతీ రంగంలో, ప్రతీ ప్రాంతంలో మార్పు తెచ్చి చూపిస్తున్నాం. ఉత్తరాంధ్రలో ఆర్సెలర్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ప్లాంట్ రాకతో గొప్ప ముందడుగు వేశాం. 21 నెలల క్రితం కబ్జాలు, కూల్చివేతలు, కేసులతో అభద్రత, భయం, మానసిక క్షోభతో అల్లాడిన ఉత్తరాంధ్ర ప్రాంతంలో... నేడు అభివృద్ధి, అవకాశాలు, ఆకాంక్షలతో అన్ని చోట్లా ఆనందాన్ని, భవిష్యత్ పై భరోసాను తీసుకువచ్చాం. ఆంధ్రుల హక్కు అని పోరాడి సాధించుకున్న విశాఖ ఉక్కు పరిశ్రమ మన ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిస్తే... ఇప్పుడు అనకాపల్లి జిల్లాలో ఏర్పాటు అవుతున్న ఆర్సెలర్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ఇండియా పరిశ్రమ ఉత్తరాంధ్ర భవిష్యత్‌కు నూతన దిక్సూచి అవుతుంది. రూ.1.36 లక్షల కోట్ల పెట్టుబడితో రెండు దశల్లో ఏర్పాటు అవుతున్న ఉక్కు కర్మాగారం ఉత్తరాంధ్రను ఉక్కు ఆంధ్రాగా మారుస్తుంది. ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్ నిర్మాణంతో ఉక్కు రంగంలో ఏపీ దేశంలో అత్యున్నత స్థానానికి చేరుకుంటుంది. గౌరవ ప్రధాని మోదీ, కేంద్ర ప్రభుత్వ సహకారం వల్లనే 21 నెలల్లో ఇంత పెద్ద ప్లాంట్‌ను రాష్ట్రానికి తీసుకురాగలిగాం. ప్లాంట్‌కు అవసరమైన ముడి ఖనిజం సరఫరా నుంచి అనుమతుల వరకు కేంద్రం వేగవంతమైన, సానుకూల నిర్ణయాలతో ప్రతి దశలోనూ ఎంతో ప్రోత్సాహాన్ని ఇచ్చింది. డబుల్ ఇంజన్ సర్కారు ప్రగతిశీల నిర్ణయాల వల్లనే ఈ ప్రాంతంలో ఒక స్టీల్ సిటీ నిర్మితమవుతోంది. యువతకు లక్షల సంఖ్యలో ఉద్యోగ ఉపాధి అవకాశాలు వస్తాయి. వచ్చే మూడేళ్లలోనే ఈ ప్రాంతంలో అన్ని రంగాల్లో, అన్ని విధాలా అభివృద్ధి ఫలాలు అందుతాయి. భారతదేశంలోనే అతి పెద్ద స్టీల్ ప్లాంట్‌కు అడుగులు పడిన సందర్భంగా ఉత్తరాంధ్ర ప్రజలకు శుభాకాంక్షలు" అంటూ సీఎం చంద్రబాబు తన పోస్టులో పేర్కొన్నారు.

# విజయవాడలో ఉగ్రలింకులు..



**మొదటిపేజీ తరువాయి -** విజయవాడలో ఉగ్రవాద కార్యకలాపాలతో సంబంధాలు న్నాయనే అనుమానంతో ముగ్గురు యువకులను ఏపీ కౌంటర్ ఇంటెలిజెన్స్ (సీఐ) పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వించిపేటకు చెందిన ఇద్దరు 21 ఏళ్ల యువకులతో పాటు భవానీపురానికి చెందిన 20 ఏళ్ల యువకుడిని అధికారులు రహస్యంగా విచారిస్తున్నారు. దేశవ్యాప్తంగా ఉగ్రమూలాలపై కేంద్ర నిఘా వర్గాలు హెచ్చరికలు జారీ చేయడంతో రాష్ట్ర సీఐ సెల్ అధికారులు నిరంతర నిఘా చేపట్టారు. ఈ నిఘాలో భాగంగా సోషల్ మీడియా కార్యకలాపాలపై దృష్టి సారించిన అధికారులకు, ఈ ముగ్గురు యువకులు ఉగ్రవాద సంస్థలకు అనుకూలంగా పోస్టులు పెడుతున్నట్లు తెలిసింది. దీంతో వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు, వారి నివాసాల్లో సోదాలు నిర్వహించి ముగ్గురినీ అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి సెల్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. పోలీసుల ప్రాథమిక విచారణలో ఈ యువకులు విదేశాల్లోని ఉగ్రవాద చర్యలకు ఆకర్షితులై సోషల్ మీడియాలో ఆకర్షణీయమైన పోస్టులు పెట్టినట్లు అంగీకరించినట్లు తెలిసింది. ప్రస్తుతం వీరిని రహస్య ప్రదేశంలో విచారిస్తున్నారు. వీరికి ఏ ఉగ్రవాద సంస్థతో సంబంధాలు ఉన్నాయి? వీరిని ఎవరు ప్రోత్సహిస్తున్నారు? సోషల్ మీడియా ఖాతాల్లోని లింకులు ఎక్కడివి? అనే కోణాల్లో పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటన విజయవాడలో కలకలం రేపింది.

# మహిళా రిజర్వేషన్లపై కేంద్రం కీలక ముందడుగు



**మొదటిపేజీ తరువాయి -** నియోజకవర్గాల పునర్విభజన జరిగిన తర్వాతే మహిళా రిజర్వేషన్లు అమలవుతాయి. అయితే ఈ ప్రక్రియకు చాలా సమయం పట్టే అవకాశం ఉండటంతో ప్రభుత్వం తన ప్రణాళికను మార్చుకుంది. జాప్యాన్ని నివారించేందుకు, రాబోయే జనాభా లెక్కల కోసం ఎదురుచూడకుండా, 2011 జనాభా లెక్కల ఆధారంగానే నియోజకవర్గాల పునర్విభజన చేపట్టాలని నిర్ణయించింది. దీనికోసం రాజ్యాంగ సవరణ బిల్లుతో పాటు డీలిమిటేషన్‌కు సంబంధించిన మరో బిల్లును తీసుకురానుంది. రాజ్యాంగ సవరణకు పార్లమెంట్ ఉభయ సభల్లో మూడింట రెండొంతుల మెజారిటీ అవసరం. ఈ నేపథ్యంలో మద్దతు కూడగట్టే బాధ్యతను కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్వయంగా చేపట్టారు. సోమవారం ఆయన ఎన్డీయే పక్షాలతో పాటు వైసీపీ, బీజేడీ, సమాజ్‌వాదీ పార్టీ వంటి విపక్ష పార్టీలతో కూడా వేర్వేరుగా సమావేశమయ్యారు. అయితే, కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్ వంటి పార్టీలు ఈ సమావేశానికి దూరంగా ఉన్నాయి. మహిళా కోటాలో ఓబీసీలకు కూడా ఉప-కోటా ఉండాలని కాంగ్రెస్, ఎస్పీ వంటి పార్టీలు డిమాండ్ చేస్తున్నాయి.

**ప్రతిపాదన అమలైతే రాష్ట్రాల వారీగా భారీగా పెరగనున్న లోక్‌సభ సీట్ల సంఖ్య**

ఈ కొత్త ప్రతిపాదన అమలైతే రాష్ట్రాల వారీగా లోక్‌సభ సీట్ల సంఖ్య గణనీయంగా పెరుగుతుంది. ఉదాహరణకు, ఉత్తరప్రదేశ్‌లో 80 నుంచి 120కి, బీహార్‌లో 40 నుంచి 60కి, కేరళలో 20 నుంచి 30కి సీట్లు పెరుగుతాయి. అలాగే ఏపీలో 25 నుంచి 38కి, తెలంగాణలో 17 నుంచి 26కి పెరుగుతాయి. జనాభా నియంత్రణ పాటించడం వల్ల తమ ప్రాతినిధ్యం తగ్గుతుందని ఆందోళన చెందుతున్న దక్షిణాది రాష్ట్రాల అనుమానాలను నివృత్తి చేసేందుకే, అన్ని రాష్ట్రాల్లో దామాషా ప్రకారం 50 శాతం సీట్లు పెంచుతున్నట్లు ప్రభుత్వం వివరిస్తోంది. ఎస్సీ, ఎస్టీ రిజర్వ్ స్థానాలు కూడా ఇదే నిష్పత్తిలో 84 నుంచి 126కి, 47 నుంచి 70కి పెరుగుతాయి. ఏప్రిల్ 4తో ముగియనున్న బడ్జెట్ సమావేశాల్లోనే ఈ బిల్లులను ఆమోదింపజేసుకోవాలని ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నిస్తోంది. వీలుకాకపోతే దీనికోసమే ప్రత్యేకంగా పార్లమెంట్ సమావేశాలు నిర్వహించే ఆలోచనలో కూడా ఉన్నట్లు సమాచారం.

# యూఏఈ, సౌదీల నుంచి భారత్‌కు బయల్దేరిన ఇంధన నౌకలు

**మొదటిపేజీ తరువాయి -** నౌకలు భారత్‌కు బయల్దేరాయి. పరిస్థితి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని, నౌకాదళ అధిపతి అడ్మిరల్ దినేశ్ త్రిపాఠి తన ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ పర్యటనను సైతం రద్దు చేసుకున్నారు. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం యూఏఈ నుంచి రెండు ఎల్పీజీ క్యారియర్లు, సౌదీ అరేబియా నుంచి ఒక ముడిచమురు నౌక భారత్ వైపు ప్రయాణిస్తున్నాయి. భారత జెండాతో ఉన్న 'ఎంవీ జగ వసంత్', 'ఎంవీ పైన్ గ్యాస్' అనే రెండు ఎల్పీజీ నౌకలు సోమవారం ఉదయం యూఏఈ పోర్టుల నుంచి బయల్దేరాయి. అత్యంత కీలకమైన హార్మూజ్ జలసంధిని దాటేందుకు ఇరాన్ అనుమతి ఇవ్వడంతో ఈ నౌకలు తమ ప్రయాణాన్ని ప్రారంభించాయి. షిప్పింగ్ మంత్రిత్వ శాఖ ప్రకారం ఈ రెండు నౌకల్లో కలిపి 92,612 మెట్రిక్ టన్నుల ఎల్పీజీ ఉంది. వీటిలో 33, 27 మంది భారతీయ సిబ్బంది ఉన్నారు. గల్ఫ్ ఆఫ్ ఒమాన్‌లో ప్రవేశించాక, భారత నౌకాదళ యుద్ధనౌకలు వీటికి 24 గంటల పాటు ఎస్కార్ట్‌గా వ్యవహరిస్తాయి. 'ఎంవీ జగ వసంత్' ఈ నెల 26న కాండ్లా పోర్టుకు, 'పైన్ గ్యాస్' ఈ నెల 26న న్యూ మంగళూరు పోర్టుకు చేరుకునే అవకాశం ఉంది. మరోవైపు సౌదీ అరేబియాలోని యన్బు పోర్టులో 'ఎంటీ కల్లిస్టా' అనే ముడిచమురు నౌక లోడింగ్ పూర్తి చేసుకుని ఇవాళ భారత్‌లోని పారాదీప్ పోర్టుకు బయల్దేరనుంది. గల్ఫ్ ఆఫ్ ఏడెన్ మీదుగా సాగే ఈ నౌక ప్రయాణంలోనూ భారత నౌకాదళం భద్రత కల్పిస్తుంది. హర్మూజ్ జలసంధి గుండా వెళ్లేందుకు ఒక్కో నౌకకు 2 మిలియన్ డాలర్లు ఇరాన్ డిమాండ్ చేస్తోందన్న వార్తలను ఢిల్లీలోని ఇరాన్ రాయబార కార్యాలయం ఖండించింది. నౌకల ప్రయాణానికి ఎలాంటి రుసుము వసూలు చేయడం లేదని స్పష్టం చేసింది. అయితే, తమ జలసంధిలో భారత యుద్ధనౌకల ఎస్కార్ట్‌కు ఇరాన్ అనుమతించడం లేదు. గల్ఫ్‌లో నిరంతరం జరుగుతున్న దాడుల కారణంగా అక్కడి నౌకల్లోని భారత సిబ్బంది తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. వారికి ధైర్యం చెప్పేందుకు నౌకాదళ అధికారులు, నౌకల యజమానులు నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నారు. భారత జెండా ఉన్న నౌకల భద్రత కోసం కోల్‌కతా క్లాస్ డిస్ట్రాయర్లను గల్ఫ్ ఆఫ్ ఒమన్, గల్ఫ్ ఆఫ్ ఏడెన్ ప్రాంతాల్లో మోహరించాలని నరేంద్ర మోదీ ప్రభుత్వం నౌకాదళాన్ని ఆదేశించింది. సహాయం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని భారత నౌకల కెప్టెన్లకు భరోసా ఇస్తున్నారు.

# మోస్ట్ వాంటెడ్ మావోయిస్టు పాపారావు లొంగుబాటు



**మొదటిపేజీ తరువాయి -** ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్‌ను నక్సల్ రహితంగా మారుస్తామని ప్రభుత్వం విధించుకున్న గడువుకు వారం రోజుల ముందే ఒక చారిత్రక పరిణామం చోటుచేసుకుంది. బస్తర్‌లో కార్యకలాపాలు సాగిస్తున్న చివరి అగ్రశ్రేణి మావోయిస్టు కమాండర్ పాపారావు అలియాస్ మంగు తన సాయుధ బృందంతో సహా పోలీసులకు లొంగిపోయాడు. ఈ పరిణామం మావోయిస్టు ఉద్యమానికి గట్టి ఎదురుదెబ్బగా భావిస్తున్నారు. సుక్మా జిల్లాకు చెందిన 56 ఏళ్ల పాపారావు, దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీలో సీనియర్ సభ్యుడు. ఇతను బీజాపూర్ జిల్లాలోని కుట్రు పోలీస్ స్టేషన్‌లో 17 మంది అనుచరులతో (10 మంది పురుషులు, 8 మంది మహిళలు) కలిసి లొంగిపోయాడు. వీరి నుంచి 8 ఏకే-47 రైఫిళ్లు, ఒక ఎస్ఎల్ఆర్, ఒక ఇన్సాస్ రైఫిల్‌ను భద్రతా దళాలు స్వాధీనం చేసుకున్నాయి. పాపారావు తలపై రూ.25 లక్షల రివార్డు ఉంది. హిడ్మా ఎన్‌కౌంటర్ తర్వాత బస్తర్‌లో మోస్ట్ వాంటెడ్ నక్సలైట్‌గా పాపారావు ఉన్నాడు. ఈ విషయాన్ని ఛత్తీస్‌గఢ్ హోం మంత్రి, ఉప ముఖ్యమంత్రి విజయ్ శర్మ ధృవీకరించారు. పాపారావు లొంగుబాటుతో దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీలో ఇక క్రియాశీల సభ్యులెవరూ లేరని ఆయన తెలిపారు. లొంగిపోయే ముందు తాను పాపారావుతో ఫోన్‌లో మాట్లాడినట్లు వెల్లడించారు. రాష్ట్రం వెలుపల కేవలం ఇద్దరు అగ్ర నేతలు మిషిర్ బెస్రా, గణపతి మాత్రమే మిగిలి ఉన్నారని మంత్రి పేర్కొన్నారు. పాపారావు లొంగుబాటుతో బస్తర్‌లో సాయుధ నక్సలిజం పూర్తిగా అంతమైందని ప్రభుత్వం ప్రకటించింది. అయితే, ఈ పరిణామంపై రాష్ట్ర కాంగ్రెస్ ఆందోళన వ్యక్తం చేసింది. గడువు ముగిసిన తర్వాత అమాయక ఆదివాసులపై వేధింపులు పెరిగే ప్రమాదం ఉందని, వారిపై నక్సలైట్లు అనే ముద్ర వేసి అరెస్టులు చేయవచ్చని కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు దీపక్ బైజ్ హెచ్చరించారు. బస్తర్ సహజ వనరులను ప్రైవేట్ కంపెనీలకు అప్పగించే ప్రమాదం కూడా ఉందని ఆయన అనుమానం వ్యక్తం చేశారు.

# హైదరాబాద్‌ను అద్భుత నగరంగా తీర్చిదిద్దుదాం



**మొదటిపేజీ తరువాయి -** కోట్లతో నగరంలో పనులు చేస్తున్నట్లు చెప్పారు. హైదరాబాద్ అభివృద్ధిపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు రెండేళ్లలో కేవలం రూ.122 కోట్లు ఖర్చు చేస్తే పనులు ఎప్పుడు పూర్తవుతాయని ప్రశ్నించారు.

**భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ప్రణాళికలు :** రాజధాని నగర అభివృద్ధి, ప్రాజెక్టుల అమలు అంశాలపై రాష్ట్ర శాసనసభలో సుదీర్ఘ చర్చ జరిగింది. దీనిలో సభ్యుల ప్రశ్నకు మంత్రి శ్రీధర్ బాబు సమాధానం ఇచ్చారు. హెచ్-సిటీ కింద రూ.7,032 కోట్ల అంచనాతో 26 పనులతో పాటు రూ.1,500 కోట్లతో 49 లింక్ రోడ్లు, రూ.7,406 కోట్లతో మూడు ఎలివేటెడ్ కారిడార్లకు ఆమోదం ఇచ్చినట్టు వెల్లడించారు. రెండేళ్లలో రూ.122 కోట్లు ఖర్చు చేశామన్నారు. 2026-27లో రూ.2250 కోట్లు ఖర్చు చేస్తామని స్పష్టం చేశారు. నగరంలో ట్రాఫిక్ సమస్యలను దృష్టిలో పెట్టుకుని భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని అన్నారు.

**బీఆర్ఎస్ ఎమ్మెల్యేల విమర్శలు :** అయితే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. హైదరాబాద్ నగరంపై ప్రభుత్వానికి ఇంత నిర్లక్ష్యం ఎందుకని ప్రశ్నించారు. బీఆర్ఎస్ హయాంలో ఎస్ఆర్‌డీపీ ద్వారా ట్రాఫిక్‌ను 30 నుంచి 40 శాతం వరకు తగ్గించామని ఎమ్మెల్యే కేపీ వివేకానంద గౌడ్ పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రూ.16 వేల కోట్ల పనులు ప్రారంభించి, 26 నెలల్లో కేవలం రూ.120 కోట్లు మాత్రమే ఖర్చు చేయడం ఏమిటని ప్రశ్నించారు. ట్రాఫిక్ సమస్య పరిష్కారంపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్న ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మూసీపై ఈస్ట్-వెస్ట్ కారిడార్ అభివృద్ధి చేస్తే రద్దీ తగ్గుతుందని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ఖర్చు చూస్తే పనులు తమ మనవళ్లు చూస్తారేమోనని విమర్శించారు. నగరంలో రోడ్లు దారుణంగా తయారయ్యాయని ముఠా గోపాల్ తెలిపారు. పాత పనులను రద్దు చేసి కొత్త టెండర్ల పేరుతో ఆలస్యం చేస్తున్నారని సబితా ఇంద్రారెడ్డి తెలిపారు.

**ప్రోటోకాల్ పాటించడం లేదు :** బీఆర్ఎస్ హయాంలో చేపట్టిన పనులను కాంగ్రెస్ తమవిగా చెప్పుకుంటోందని తలసాని శ్రీనివాస్ యాదవ్ విమర్శించారు. అభివృద్ధి నిధులు ఇవ్వడం లేదని, ప్రోటోకాల్ పాటించడం లేదని అన్నారు. జవహర్ నగర్ డంప్ యార్డ్ సమస్యను ప్రస్తావించిన మల్లారెడ్డి ఆ ప్రాంతానికి ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని కోరారు. నగరంలో అభివృద్ధి పనులు స్తబ్ధుగా ఉన్నాయని, ముఖ్యమంత్రి అధికారిక కార్యక్రమంలో ఎన్నికల్లో ఓటమి పాలైన వారి పేర్లు ఎలా పెడతారని ప్రశ్నించారు.

**అవసరానికి అనుగుణంగా మార్పులు :** గత ప్రభుత్వం ప్రారంభించిన పనులను ఎక్కడా ఆపలేదని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. అవసరానికి అనుగుణంగా కొన్ని మార్పులు మాత్రమే చేశామని తెలిపారు. ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ పనులు త్వరలో వేగవంతం అవుతాయని చెప్పారు. హైదరాబాద్ వేగంగా విస్తరిస్తోందని, భవిష్యత్ ట్రాఫిక్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఫ్యూచర్ సిటీ అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. మూసీ అభివృద్ధి విషయంలో బీఆర్ఎస్ రాజకీయాలు చేస్తోందని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో ప్రోటోకాల్ ఉల్లంఘనలు చాలా జరిగాయని పేర్కొన్నారు.

**వచ్చే ఎన్నికల నాటికి గణనీయమైన పురోగతి :** కేంద్రం తెలంగాణకు మరిన్ని నిధులు ఇవ్వాలని డిమాండ్ చేసిన మంత్రి, రాష్ట్రంలోని కేంద్ర మంత్రులు, బీజేపీ ఎంపీలు ప్రయత్నాలు చేయాలని కోరారు. ఎమ్మెల్యేలతో త్వరలో సమావేశం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. వచ్చే ఎన్నికల నాటికి గణనీయమైన పురోగతి చూపిస్తామని అందరమూ కలిసి హైదరాబాద్‌ను అద్భుత నగరంగా తీర్చిదిద్దుదామని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. "హైదరాబాద్‌లో పనుల కోసం 2026-27లో 2250 కోట్లు ఖర్చు చేస్తాం. మనవళ్ల వరకు చూడాల్సిన అవసరం లేదు వచ్చే ఎన్నికల నాటికి గణనీయమైన పురోగతి సాధిస్తాం. మూసీ విషయంలో మంచి ఆలోచనతో ఉన్నప్పటికీ బీఆర్ఎస్ రాజకీయం చేస్తోంది. హైదరాబాద్ భారీగా వలసలు కొనసాగుతున్నాయి. ట్రాఫిక్ సమస్యపై పెద్ద ఎత్తున దృష్టి సారిస్తున్నాం. అందులో భాగంగా ఫ్యూచర్ సిటీ అభివృద్ధి చేస్తున్నాం."

# టాస్క పోరాట ఫలితమే తల్లి దండ్రులకు భరోసా చట్టం

**టాస్క రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్ కుమార్**

**ముఖ్య మంత్రి చిత్ర పటానికి సీనియర్ సిటిజెన్ల పాలాభిషేకం**



**జగిత్యాల మార్చి 24(ప్రజా మంటలు) :** తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ కార్యవర్గాలు రాష్ట్ర అధ్యక్షులు పి. నర్సింహా రావు ఆధ్వర్యంలో చేసిన పోరాట ఫలితమే మంత్రి వర్గం ఆమోదం తెలిపిన తల్లి దండ్రులకు సర్కారు భరోసా చట్టం అని టాస్క రాష్ట్ర కార్యదర్శి, జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్ అన్నారు. మంగళవారం తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ జగిత్యాల జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్ ఆధ్వర్యంలో 'తెలంగాణ ఎంప్లాయిస్ అకౌంటబిలిటి అండ్ మానిటరింగ్ ఆఫ్ పేరెంటల్ సపోర్ట్ యాక్ట్ -2026 బిల్లును మంత్రి వర్గం ఆమోదించడం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్ర పటానికి జిల్లా, డివిజన్, మండలాల సీనియర్ సిటిజెన్స్ సంఘాల ప్రతినిధులు పాలాభిషేకం చేశారు. టాస్క జిల్లా కా ర్యాలయం ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్ కుమార్ మాట్లాడుతూ ఈ బిల్లు పరిధిలోకి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులతో పాటు ప్రజాప్రతినిధులను తీసుకు రావడం టాస్క తరపున ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు.రాష్ట్రము లోని దాదాపు 10.50 లక్షల మంది ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులు ఈ చట్టం పరిధి లోకి వస్తారని, తల్లి దండ్రులకు కుమారుడు లేకపోతే ఉద్యోగం చేస్తున్న కూతుర్లు వారిని పోషించాల్సి ఉంటుందని, కొడుకు మరణిస్తే ఉద్యోగి అయిన కోడలు పోషించాలని, కోడలు ఉద్యోగి కాని పక్షంలో కొడుకు కు వచ్చే పెన్షన్ నుంచి అత్తా మామలకు కొంత ఇవ్వాల్సి ఉంటుందని, జిల్లా స్థాయిలో కలెక్టర్ దీనిని అమలు చేస్తారని, అక్కడ న్యాయం జరుగక పోతే రాష్ట్ర స్థాయిలో కమిషన్ కు అప్పీల్ చేసుకోవచ్చని,ఈ చట్టం అమలుకు పటిష్ట చర్యలు తీసుకోవాలని తమ టాస్క తరపున ముఖ్య మంత్రి ని కోరుతున్నామన్నారు.ఖీ ఈ కార్యక్రమం లో జిల్లా ప్రధాన కార్యదర్శి గౌరి శెట్టి విశ్వనాథ మ్, రాష్ట్ర నాయకులు మాజీ మున్సిపల్ చైర్మన్ జీ ఆర్ దేశాయ్, జీ ఆర్. దేశాయ్, ఉపాధ్యక్షులు బొల్లం విజయ్, పూసాల అశోక్ రావ్, ఆర్గనైజ్ కార్యదర్శులు సత్యనారాయణ, ఎం. డి. యాకూబ్, జిల్లా ప్రతినిధులు కరుణ,ఎం. డి. ఇక్బల్, సయ్యద్ యూసుఫ్, నారాయణ, బ్రహ్మయ్య, డివిజన్ ప్రతినిధులు పబ్బా శివానందం, వొజ్జల బుచ్చి రెడ్డి, పట్టణ ప్రతినిధులు సింగం గంగాధర్, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

# టీబీ నిర్మూలనకు అందరి భాగస్వామ్యం అవసరం

**గాంధీలో ప్రపంచ టీబీ దినోత్సవం**

**సికింద్రాబాద్, మార్చి 24 (ప్రజా మంటలు) :** క్షయవ్యాధి నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ ఎస్. సంగీత సత్యనారాయణ పిలుపునిచ్చారు. ప్రపంచ టీబీ దినోత్సవం సందర్భంగా సికింద్రాబాద్ గాంధీ వైద్య కళాశాలలోని ఆలుమ్ని ఆడిటోరియంలో మంగళవారం నిర్వహించిన '100 రోజుల టీబీ ముక్త్ భారత్ అభియాన్' కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ తొలి విడతలో 17.09 లక్షల మందికి టీబీ నిర్ధారణ పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. నిక్షయ్ పోషణ్ యోజన ద్వారా కోట్లాది మందికి పోషకాహారం అందించామని పేర్కొన్నారు. టీబీ నిర్మూలనలో తెలంగాణ రాష్ట్రం ముందంజలో ఉందని చెప్పారు.టీబీ లక్షణాలు ఉన్న వారికి ఉచిత పరీక్షలు, మందులు అందిస్తున్నామని, వ్యాధిపై ఉన్న అపోహలను తొలగించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగస్వాము లవుతున్న స్వచ్ఛంద సంస్థలు, ఆరోగ్య కార్యకర్తల సేవలను ఆమె అభినందించారు.ఈ సందర్భంగా టీబీ నిర్మూలనలో మెరుగైన పనితీరు కనబరిచిన జిల్లాల అధికారులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ప్రచార పోస్టర్లను విడుదల చేయడంతో పాటు, టీబీ బాధితులకు పోషకాహారం పంపిణీ చేశారు. '100 రోజుల టీబీ ముక్త్ భారత్ అభియాన్' ప్రచార యాత్రను జెండా ఊపి ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ రీజనల్ డైరెక్టర్ డా. ఎం. అనురాధ, ప్రజా ఆరోగ్యం కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ డా. రవీందర్ నాయక్, తెలంగాణ టీబీ అసోసియేషన్ వైస్



చైర్మన్ డా. సుధీర్ ప్రసాద్, ఎస్‌టిడీసీ డా. రాజేశ్వరి, డబ్ల్యూహెచ్‌ఓ టీబీ కన్సల్టెంట్ డా. మహేష్, డా. బ్లెస్సి, జేడీ టీబీ ఆఫీస్ హెల్త్ ఎక్స్టెన్షన్ అధికారి మొగరాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# మార్చి 24 తో దేశవ్యాప్తంగా అమలైన లాక్ డౌన్ కు ఆరు సంవత్సరాలు

**కాంగ్రెస్ యువ నాయకుడు గొడిశాల అర్జున్ గౌడ్**

**ఎల్కతుర్తి మార్చ్ 24 ప్రజా మంటలు :** ఎల్కతుర్తి మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ యువ నాయకుడు గొడిశాల అర్జున్ గౌడ్ తన అభిప్రాయాలను వెల్లడించారు. దేశ ప్రజల జీవితాలను ఒక్కసారిగా నిలిపివేసిన కరోనా లాక్ డౌన్ కు మార్చి 24 తో ఆరు సంవత్సరాలు పూర్తిఅయ్యాయి. ఈ సందర్భంగా 2020 మార్చి 24న దేశవ్యాప్తంగా ప్రకటించిన లాక్ డౌన్ ప్రతి ఒక్కరి జీవితంలో మర్చిపోలేని అధ్యాయంగా మిగిలిపోయింది. ఆ రోజుల్లో ప్రజలు ఎన్నో కష్టాలను ఎదుర్కొన్నారు. ముఖ్యంగా పేదలు కూలీలు చిన్న వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఉద్యోగాలు కోల్పోయిన వారు ఆర్థికంగా నష్టపోయిన కుటుంబాలు ఇప్పటికీ ఆ ప్రభావం నుంచి పూర్తిగా బయటపడలేదు అని ఆయన పేర్కొన్నారు. లాక్ డౌన్ సమయంలో ప్రజలు ఎదుర్కొన్న సమస్యలు ప్రభుత్వ వ్యవస్థల లోపాలను స్పష్టంగా చూపించాయని ఆయన విమర్శించారు. అప్పటి పరిస్థితులలో ప్రజలకు తగిన సహాయం అందించడంలో ప్రభుత్వాలు మరింత బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరం ఉండేదని అన్నారు. కష్ట కాలంలో ప్రజలు చూపిన సహనం పరస్పర సహకారం గొప్పదని ఒకరికి ఒకరు తోడుగా నిలిచి సమాజం ఏకత్వాన్ని ప్రదర్శించిందని ఆయన కొనియాడారు. వైద్య సిబ్బంది పోలీసులు స్వచ్ఛంద సేవకులు చేసిన సేవలు ఎప్పటికీ మరువలేనివని గుర్తు చేశారు. ఆరు సంవత్సరాల తరువాత కూడా ఆ అనుభవాలు మనకు ఎన్నో పాఠాలు నేర్పాయని భవిష్యత్తులో ఇలాంటి విపత్తులు వచ్చినప్పుడు ప్రజలకు మరింత రక్షణ భరోసా కల్పించే విధంగా ప్రభుత్వాలు ముందస్తు చర్యలు తీసుకోవాలని గొడిశాల అర్జున్ గౌడ్ సూచించారు. లాక్ డౌన్ సమయంలో ప్రాణాలు కోల్పోయిన వారిని స్మరించుకుంటూ వారి కుటుంబాలకు ఆయన సానుభూతి తెలిపారు.



# కొండగట్టు శ్రీ హనుమాన్ చిన్న జయంతి ఉత్సవాల ఏర్పాట్లపై పరిశీలనలిచేసిన జిల్లా కలెక్టర్



**కొండగట్టు మార్చి 24 (ప్రజా మంటలు) :** కొండగట్టు శ్రీ హనుమాన్ చిన్న జయంతి ఉత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు సమగ్రంగా చేయాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు.మంగళవారం కొండగట్టు ఆలయ పరిసరాల్లో నిర్వహించనున్న జయంతి ఉత్సవాల ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్, ఎస్పీ అశోక్ కుమార్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా భక్తుల సౌకర్యార్థం చేపడుతున్న ఏర్పాట్లను ప్రత్యక్షంగా సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ ఉత్సవాలకు భారీ సంఖ్యలో భక్తులు హాజరవుతారని భావించి ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా భద్రతా ఏర్పాట్లు కట్టుదిట్టంగా ఉండేలా పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు.అదేవిధంగా, పార్కింగ్ సదుపాయాలు సరిపడా ఉండేలా చూడాలని, ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక ప్రణాళిక అమలు చేయాలని అధికారులకు సూచించారు. భక్తులకు తాగునీరు, మరుగుదొడ్లు వంటి మౌలిక సదుపాయాలు సమృద్ధిగా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి అత్యవసర పరిస్థితులకు సిద్ధంగా ఉండాలని, అంబులెన్స్ సేవలు అందుబాటులో ఉంచాలని ఆరోగ్య శాఖ అధికారులకు ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. రాజ గౌడ్, జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, డిపివో మదన్ మోహన్, ఆలయ ఏవో అంజనా రెడ్డి, ఎమ్మార్వోలు , ఎంపిడివోలు, సంబంధిత శాఖల అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.

# మిషన్ భగీరథ నల్ల బిల్లులు ప్రజలకు భారం

**హుస్నాబాద్,మార్చి24,(ప్రజా మంటలు) :** హుస్నాబాద్ పట్టణంలో నెలకొన్న ప్రజా సమస్యలను నేడు మున్సిపాలిటీలో జరగబోయే పాలకవర్గ సమావేశంలో అత్యవసరంగా చర్చించి పరిష్కరించాలని హుస్నాబాద్ బీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నియోజకవర్గ ఇన్చార్జ్ పచ్చిమట్ల రవీందర్ గౌడ్ కోరారు . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలో కోతుల సమస్య రోజు రోజుకు తీవ్రమవుతూ ప్రజలు బయటకు రావడానికి కూడా భయపడే పరిస్థితి ఏర్పడింది. కోతుల దాడులతో పలువురు గాయాలపాలవుతున్నారు. ఈ సమస్యపై ఇప్పటికే అఖిలపక్ష నాయకులు మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ ని కలిసి ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని విన్నవించాము. వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతున్నామన్నారు. మిషన్ భగీరథ నల్ల బిల్లుల




విషయంలో ప్రజలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం నల్ల కనెక్షన్లు ఉచితం అని ప్రకటించింది. అయితే ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం 2015 నుండి ఇప్పటివరకు ఒక్కో ఇంటికి 9 వేల రూపాయల వరకు బకాయిలు చూపిస్తూ వసూలు చేయడం అన్యాయం.మున్సిపాలిటీలో ఏ చిన్న పని కోసం వెళ్లినా, ఈ బకాయిల పేరుతో ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. కాబట్టి ఈ అంశాన్ని సమావేశంలో చర్చించి, మంత్రి దృష్టికి తీసుకెళ్లి నల్ల బిల్లులను పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. గతవారం నిర్వహించిన హుస్నాబాద్ పట్టణ అంగడి సమస్యను రాజకీయంగా మార్చకుండా నిబంధనల ప్రకారం వేలం పాటదారునికి కేటాయించాలని, మళ్లీ టెండర్ నిర్వహిస్తే నష్టం జరిగితే బాధ్యత ఎవరు వహిస్తారో స్పష్టం చేయాలని కోరారు.ఈ అన్ని సమస్యలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని బీఎస్పీ పార్టీ తరపున విజ్ఞప్తి చేస్తున్నామన్నారు.

## క్షయవ్యాధి నిర్మూలనకు ప్రజలలో అవగాహన పెంపొందించాలి

**జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్**



**జగిత్యాల మార్చి 24 (ప్రజా మంటలు) :** ప్రపంచ క్షయవ్యాధి దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా మున్సిపల్ సిబ్బందికి అలాగే ప్రజలకు క్రమంగా క్షయ వ్యాధి (టిబి)పరీక్షలు నిర్వహించి, డయాలసిస్ చేయాల్సిందిగా వైద్య అధికారులకు ఆదేశించారు. క్షయవ్యాధి (టిబి) పూర్తిగా నయం చేయగల వ్యాధి అని, సమయానికి పరీక్షలు చేయించుకొని సరైన చికిత్స తీసుకోవడం ఎంతో ముఖ్యమని తెలిపారు. ప్రజల్లో అవగాహన పెంచడం ద్వారా టిబి వ్యాధిని పూర్తిగా నిర్మూలించవచ్చని ఆయన పేర్కొన్నారు.టిబి లక్షణాలు, నివారణ చర్యలు, ఉచిత పరీక్షలు మరియు చికిత్సపై వైద్య అధికారులు ప్రజలకు వివరించారు. ప్రజలకు క్షయ వ్యాధి పట్ల పూర్తి స్థాయిలో అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన అవగాహన ర్యాలీలో జిల్లా కలెక్టర్ పాల్గొని ప్రజలకు సందేశాన్ని చేరవేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సమిండ్ల వాణి, జిల్లా వైద్యాధికారి డా. సుజాత, జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, సంబంధిత అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.

## రైతులు అంటే కాంగ్రెస్ ప్రభుత్వనికి చిన్న చూపా...?

**దావ వసంత సురేష్**



**జగిత్యాల మార్చి 24 (ప్రజా మంటలు) :** రూరల్ మండలం హైదర్ పెల్లి గ్రామంలో మొక్కజొన్న పంట కుప్పలను బి ఆర్ ఎస్ నాయకులతో కలిసి పరిశీలించిన జిల్లా తొలి జడ్పీ చైర్పర్సన్ దావ వసంత సురేష్ ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ప్రారంభించక ఇప్పటి వరకే దాదాపుగా సగం వరకు దళారులకు రైతులు అమ్ముకొని కింటలు 800 రూపాయలు నష్టపోయారని అన్నారు. ఈ ప్రభుత్వంలో సరైన సమయానికి ఎరువులు పంపిణీ చేయడం లో విఫలం అయిందని, నకిలీ విత్తనాలు అరికట్టలేక రైతులు తీవ్రంగా నష్టపోయారని మరియు విత్తనాల ధర కూడా విపరీతంగా ఈ కాంగ్రెస్ ప్రభుత్వం లో పెంచారని ఆరోపించారు. రైతుబంధు రుణమాఫీ చేయలేక కాంగ్రెస్ ప్రభుత్వం రైతులని తీవ్రంగా మోసం చేసిందని అన్నారు. వర్షాలకు నష్టపోయిన పంట నష్టపరిహారం కూడా చెల్లించలేదని అన్నారు. ప్రభుత్వం వరి పంట తో పాటు మొక్కజొన్న కూడా క్వింటాలకు 500 చొప్పున బోనస్ తో పాటు మద్దతు ధర 2400 రూపాయలు ఇవ్వాలని రైతుల పక్షాన డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఆనంద్ రావు మాజీ సర్పంచ్ లు అంజయ్య బుర్ర ప్రవీణ్ గౌడ్ బి ఆర్ ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# ఇండ్ల మధ్యే బోల్టుల తయారీ యూనిట్లు

**కాలుష్యంతో కాలనీ వాసుల అవస్థలు**

**హైకోర్టు ఆదేశాలైనా అమలు కాని పరిస్థితి**





**సికింద్రాబాద్, మార్చి 24 (ప్రజా మంటలు) :** కవాడిగూడ జీహెచ్ఎమ్సీ సర్కిల్ పరిధిలోని బన్సీలాల్‌పేట డివిజన్ అరుణ్ జ్యోతి కాలనీలో ఇండ్ల మధ్యే ఇనుప బోల్టుల తయారీ యూనిట్లు కొనసాగుతుండటంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డుపైనే పనులు నిర్వహించడం వల్ల రాకపోకలకు అంతరాయం కలుగుతుండగా, యంత్రాల నుంచి వెలువడే శబ్దం, దూళి, వాయు కాలుష్యంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.పరిశ్రమల వల్ల ఏర్పడుతున్న వైబ్రేషన్ల కారణంగా ఇళ్ల గోడలకు బీటలు పడుతున్నాయని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై పలుమార్లు జీహెచ్ఎమ్సీ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ స్పందన లేకపోవడంతో హైకోర్టును ఆశ్రయించారు. ఇండ్ల మధ్య పరిశ్రమలు నడుస్తున్నట్లయితే విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోర్టు ఆదేశించింది.అయితే అధికారులు హియరింగ్ నోటీసులు జారీ చేసినప్పటికీ, ఇప్పటివరకు స్పష్టమైన చర్యలు చేపట్టలేదని ఫిర్యాదుదారులు పేర్కొంటున్నారు. "కాలుష్యం, శబ్దంతో జీవనం దుర్భరంగా మారింది. ఇళ్లకు నష్టం జరుగుతోంది. అక్రమ యూనిట్లపై వెంటనే చర్యలు తీసుకోవాలి" అని వారు డిమాండ్ చేస్తున్నారు.

**చర్యలు తీసుకుంటాం: అధికారులు**

హైకోర్టు ఆదేశాల మేరకు విచారణ జరిపి, నివేదిక ఆధారంగా తగిన చర్యలు తీసుకుంటామని కవాడిగూడ సర్కిల్ అధికారులు తెలిపారు.

# ప్రమాద ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డుల ఏర్పాటు

**భీమదేవరపల్లి, మార్చి 24 (ప్రజా మంటలు) :** మండలంలోని కొత్తపల్లి, గట్ల నర్సింగపూర్, రామనగర్ ప్రాంతాల్లో తరచుగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని మంగళవారం పోలీసులు హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. ప్రమాదాలకు గురయ్యే ప్రధాన మలుపులు, రహదారి కూడళ్ల వద్ద ఈ బోర్డులను ఏర్పాటు చేసి వాహనదారులు జాగ్రత్తగా ప్రయాణించాలనే సూచనలు చేశారు. ఈ కార్యక్రమాన్ని ఎస్ఐ రాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రమాదాల నివారణే లక్ష్యంగా ఈ చర్యలు చేపట్టినట్లు ఆయన తెలిపారు. వేగ పరిమితి పాటించడం, హెల్మెట్ ధరించడం, రాత్రివేళల్లో హెడ్‌లైట్లు ఉపయోగించడం వంటి సూచనలు వాహనదారులు పాటించాలని అన్నారు. వాహనదారులు ట్రాఫిక్ నియమాలు తప్పనిసరిగా పాటించాలని, ముఖ్యంగా ప్రమాదాలకు గురయ్యే ప్రాంతాల్లో నెమ్మదిగా ప్రయాణించాలని పోలీసులు కోరారు. ప్రజల భద్రత కోసం ఇలాంటి చర్యలు కొనసాగిస్తామని ఎస్ఐ రాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ శోభన్ పాల్గొన్నారు.




## చింతల్ పల్లి గ్రామం నుండి బయలుదేరి తిరుమల తిరుపతి దేవస్థానంలో పాల్గొన్న శ్రీ పార్వతి మాత కోలాట భజన బృందం



**ఎల్కతుర్తి మార్చి 24 ప్రజా మంటలు :** ఎల్కతుర్తి మండలం చింతలపల్లి గ్రామం నుండి తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో అఖండ హరినామా కీర్తన భజనలో భాగంగా చింతల పెల్లి శ్రీ పార్వతి మాత కోలాట బృందం వారిచే భజన కార్యక్రమం తిరుపతిలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో దేవకారి పద్మ లత నిర్మల గిరిజా భాయ్ సుధాకర్ రావు నరసింహారావు లాడే శంకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

# "జాతీయ మెగా లోక్ అదాలత్ ద్వారా రాజీతో కేసులను పరిష్కరించుకోండి

**జిల్లా ఎస్పీ అశోక్ కుమార్**



**జగిత్యాల మార్చి 24 (ప్రజా మంటలు) :** ఈనెల 28న నిర్వహించబడనున్న జాతీయ మెగా లోక్ అదాలత్ సందర్భంగా, రాజీ పడదగిన కేసులను పరస్పర అంగీకారంతో పరిష్కరించుకోవాలని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ సూచించారు.ఈ లోక్ అదాలత్‌లో క్రిమినల్ కంపౌండబుల్ కేసులు, సివిల్ వివాదాలు, ఆస్తి విభజన కేసులు, కుటుంబ పరమైన నిర్వహణ కేసులు, వైవాహిక వివాదాలు, బ్యాంకు రికవరీ కేసులు, విద్యుత్ చౌర్యం కేసులు, చెక్ బౌన్స్ కేసులు, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు, చిన్నచిన్న పెట్టి కేసులు మరియు ఇతర రాజీ పడదగిన కేసులను సులభంగా పరిష్కరించుకునే అవకాశం ఉందని తెలిపారు.రాజీ మార్గమే రాజమార్గమని, జుడిషియల్ శాఖ కల్పించిన ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లా పోలీస్ అధికారులు, కోర్టు విధులు నిర్వహించే కానిస్టేబుల్‌లు మరియు ఇతర సిబ్బంది రాజీ పడదగిన కేసులను గుర్తించి, ఇరువర్గాల వారికి కౌన్సెలింగ్ నిర్వహించి రాజీ కుదిరేలా అవగాహన కల్పిస్తారని తెలిపారు.కాబట్టి తమ కేసులను రాజీ ద్వారా పరిష్కరించుకోవాలని భావించే వారు సంబంధిత పోలీస్ అధికారులను సంప్రదించాలని, లోక్ అదాలత్ ద్వారా బాధితులకు త్వరితగతిన న్యాయం అందుతుందని జిల్లా ఎస్పీ పేర్కొన్నారు.

## శాంతి భద్రతల పరిరక్షణకు జిల్లా పోలీసులు ప్రత్యేక చర్యలు



**జగిత్యాల మార్చి 24 (ప్రజా మంటలు) :** భద్రతా చర్యల్లో భాగంగా జిల్లా కోర్టు, సబ్ కోర్టుల్లో బాంబ్ డిస్పోజల్ టీం, పోలీసు జగిలాలతో ప్రత్యేక తనిఖీలు జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు జిల్లా కోర్టు, సబ్ కోర్టు ప్రాంగణలలో భద్రతా చర్యలను మరింత బలోపేతం చేయడం కోసం బాంబ్ డిస్పోజల్ టీం, పోలీసు జగిలాల తో ప్రత్యేక తనిఖీలు నిర్వహించడం జరిగింది. తనిఖీల సమయంలో ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు, పార్కింగ్ స్థలాలు, మరియు కోర్టుల పరిసర ప్రాంతాలను ఒక్కొక్కటిగా పరిశీలించారు.అనుమానాస్పద వస్తువులు, ప్యాకేజీలు, సంచులు లేదా భద్రతకు ముప్పు కలిగించే అంశాలపై ప్రత్యక తనికి నిర్వహించారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్త చర్యలుగా ఈ తనిఖీలు నిర్వహిస్తున్నామని జిల్లా ఎస్పి అశోక్ కుమార్ తెలిపారు.ఈ తనిఖీల్లో, బాంబ్ డిస్పోజల్ టీం, డాగ్ స్క్వాడ్ సిబ్బంది పాల్గొన్నారు.

# సహకార సంఘం 71వ మహాసభ



**ఎల్కతుర్తి మార్చ్ 24 ప్రజా మంటలు :** హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలంలో మంగళవారం ది విశాల సహకార సంఘం 71 వ మహా జనసభ జరిగింది. ఈ సమావేశంలో ముందుగా సహకార సంఘాన్ని 1957వ సంవత్సరం స్థాపించిన కీర్తి శేషులు పొలసాని నరసింహారావు చిత్రపటానికి మార్కెట్ కమిటీ చైర్మన్ సుకినే సంతాజి, స్పెషల్ ఆఫీసర్ అబ్జాలుద్దీన్ మరియు విశాల సహకార సంఘం మాజీ చైర్మన్ శ్రీపతి రవీందర్ గౌడ్ తో కలిసి పూలమాలవేసి నివాళులు అర్పించారు. సహకార సంఘం ఈ సంవత్సరం కోటి రూపాయల లాభంతో ఏ గ్రేట్ సంఘంగా అభివృద్ధి చెందిన ది విశాల సహకార సంఘం అందరి సహకారంతో ఇంకా అభివృద్ధి చెందాలని కోరుకుంటున్నారు.

# చర్చ లేకుండా చట్టాలు చేయడం వల్లే కేసులు పేరుకుపోతున్నాయి

**జస్టిస్ ఎన్వీ రమణ**

**ఘనంగా బెజవాడ బార్ అసోసియేషన్ 120వ వార్షికోత్సవ సభ**

**ముఖ్యఅతిథిగా హాజరైన జస్టిస్ ఎన్వీ రమణ**

**యువత న్యాయ వ్యవస్థ ప్రతిష్టను నిలబెట్టాలని సూచన**



న్యాయవ్యవస్థ పట్ల ప్రభుత్వాలు చిన్న చూపు చూస్తున్నాయని సుప్రీం కోర్టు పూర్వ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం రాత్రి జరిగిన బెజవాడ బార్ అసోసియేషన్ 120వ వార్షికోత్సవ సభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. న్యాయవ్యవస్థ తిరోగమనం వైపు నడుస్తోందని, చట్ట సభల్లో న్యాయవాదులకు స్థానం ఉండటం లేదని ధనవంతులు, కాంట్రాక్టర్లకు రాజకీయ పార్టీలు పెద్ద పీట వేస్తున్నాయని చెప్పారు. యువకులు న్యాయ వ్యవస్థ ప్రతిష్టను నిలబెట్టాలి అని కోరారు.దేశంలో ఏ ప్రభుత్వమైనా లేదా ఏ పార్టీ అయినా న్యాయ వ్యవస్థను చిన్న చూపే చూస్తున్నాయని సుప్రీం కోర్టు పూర్వ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ అన్నారు. బెజవాడ బార్ అసోసియేషన్ 120వ వార్షికోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశ వ్యాప్తంగా న్యాయవాద వృత్తి తిరోగమనంలో ఉందని ఆయన అన్నారు. ఒకప్పుడు న్యాయవాద వృత్తికి గుర్తింపుగా నిలిచి, బ్రిటిష్ వారి తుపాకులను ఎదుర్కొని నిర్భయంగా నిలబడిన టంగుటూరి ప్రకాశం పంతులు వంటి వారి స్ఫూర్తిదాయకమైన నాయకత్వం ఇప్పుడు కొరవడిందని ఆయన విచారం వ్యక్తం చేశారు. చట్ట సభల్లోను కూడా న్యాయవాదులకు ఇప్పుడు స్థానం ఉండడం లేదని జస్టిస్ ఎన్వీ రమణ ఆవేదన వ్యక్తం చేశారు.సభల్లో చట్టాల గురించి చర్చ జరగకపోవడమే లోపభూయిష్టమైన చట్టాల ఆమోదానికి కారణం అని జస్టిస్ ఎన్వీ రమణ పేర్కొన్నారు. దీని వల్ల కేసుల సంఖ్య పేరుకుపోయి ప్రజలకు న్యాయం జరగడం లేదని అన్నారు. న్యాయస్థానాల్లో సౌకర్యాలపై ప్రభుత్వాలు దృష్టి సారించాలని కోరారు. తాను భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ)గా ఉన్న సమయంలో దేశంలోని న్యాయమూర్తులు, ముఖ్యమంత్రులతో రాష్ట్రపతి, ప్రధాని సమావేశం ఏర్పాటు చేశారన్నారు. ఆ భేటీలో దేశంలోని అన్ని కోర్టుల పరిస్థితిని కూడా వివరించానని గుర్తు చేశారు. జడ్జిల క్వార్టర్లు, కోర్టు భవనాలను ఎక్కడెక్కడ నిర్మించాల్సిన అవసరం ఉందో వివరించానని, ఆ సమావేశంలో దీన్ని ఆమోదించారని చెప్పారు. కేంద్రం ఆర్థిక సాయం చేయాలని కోరానని అయితే దీన్ని పక్కన పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు."చట్టసభల్లో న్యాయవాదులకు ఇప్పుడు స్థానం ఉండడం లేదు. పార్టీలు సైతం కాంట్రాక్టర్లు, మాఫియా, ధనవంతులు మొదలైన వారికి ప్రాధాన్యత ఇస్తున్నాయి. సభల్లో చట్టాల గురించి చర్చ జరగడం లేదు. అందువల్లే లోపభూయిష్టమైన చట్టాలను చేస్తున్నారు. దీని వల్ల కోర్టుల్లో కేసుల సంఖ్య పేరుకుపోతోంది. తద్వారా ప్రజలకు న్యాయం జరగడం లేదు." జస్టిస్ ఎన్.వి. రమణ, సుప్రీంకోర్టు పూర్వ ప్రధాన న్యాయమూర్తిఎందరో ఉద్దండ న్యాయవాదులు బెజవాడ బార్ అసోసియేషన్ నుంచి వచ్చారు అని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నైనాల జయసూర్య అన్నారు. ఈ స్ఫూర్తి కొనసాగాలని అన్నారు. జ్ఞానానికి, శక్తికి, చైతన్యానికి ఈ అసోసియేషన్ కేంద్ర బిందువు అని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్ అన్నారు. న్యాయమూర్తులు బార్ అసోసియేషన్ ల నుంచే అధికంగా వస్తారని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి అన్నారు. అసోసియేషన్‌లు బలంగా ఉంటే న్యాయవ్యవస్థ అంత బలోపేతం అవుతుందన్నారు. సమావేశం అనంతరం బార్ కౌన్సిల్ సభ్యురాలు గంగాభవానీని సత్కరించారు. అతిథులకు శాలువాలతో బార్ అసోసియేషన్ సభ్యులు సత్కరించారు.

# దర్యాప్తు అధికారి కోరినప్పుడల్లా సునీయనాయక్ విచారణకు రావాల్సిందే

**సునీల్‌నాయక్ ముందస్తు బెయిల్ పిటిషన్‌పై హైకోర్టులో విచారణ**

**ఆన్‌లైన్ ద్వారా విచారణకు హాజరయ్యేందుకు అనుమతించాలని సునీల్ అభ్యర్థన**

**దర్యాప్తు కోరినప్పుడల్లా విచారణకు రావాలని ఆదేశించిన హైకోర్టు**

దర్యాప్తు అధికారి పిలిచినపుడు విచారణకు హాజరుకావాలని ఐపీఎస్ అధికారి సునీల్ నాయక్‌ను హైకోర్టు ఆదేశించింది. రఘురామ కృష్ణంరాజు కస్టోడియల్ టార్చర్ కేసులో నిందితుడు సునీల్ నాయక్ దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటీషన్ విచారణార్హతపై న్యాయస్థానం విచారణ జరిపింది.ఇరువురి వాదనలు విన్న న్యాయస్థానం తదుపరి విచారణను ఏప్రిల్ 6వ తేదీకి వాయిదా వేసింది. ఆరోజున తగిన ఉత్తర్వులిస్తామని ఈ సందర్భంగా తెలిపింది. ఆన్‌లైన్ ద్వారా విచారణకు హాజరయ్యేందుకు అనుమతించాలని కోరిన సునీల్ నాయక్ అభ్యర్థనను కోర్టు తిరస్కరించింది. కేసులో నిందితుడిగా ఉన్న వ్యక్తికి వెసులుబాటు ఇవ్వలేమని స్పష్టం చేసింది. ఇలాంటి వాటికి అనుమతిస్తే రేపటి రోజున జైలు శిక్షను కూడా ఇంట్లో ఉండి ఆన్‌లైన్ ద్వారా అనుభవిస్తామనే ప్రమాదం ఉందని వ్యాఖ్యానించింది.అభ్యర్థనను తిరస్కరించిన హైకోర్టు: మాజీ ఎంపీ, ప్రస్తుత శాసనసభ ఉపసభాపతి రఘురామ కృష్ణరాజుపై వైఎస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో హత్యాయత్నం, చిత్రహింసలకు గురిచేసిన కేసులో దర్యాప్తు అధికారి పిలిచినప్పుడు ఆయన ముందు హాజరుకావాలని బీహార్ క్యాడర్ ఐపీఎస్ అధికారి సునీల్ నాయక్‌కు హైకోర్టు తేల్చి చెప్పింది. ఫోన్ నంబర్‌ను ఐవోకు అందజేయాలని స్పష్టం చేసింది. ఐవో ముందు భౌతికంగా హాజరుకు మినహాయింపును ఇచ్చి ఆన్‌లైన్ ద్వారా విచారణకు హాజరయ్యే వెసులుబాటు ఇవ్వాలని సునీల్ నాయక్ చేసిన అభ్యర్థనను తోసిపుచ్చింది. కేసులో నిందితుడిగా ఉన్న వ్యక్తికి ఈ తరహా వెసులుబాటు ఇవ్వలేమని తేల్చి చెప్పింది.ఇలాంటి వాటికి అనుమతిస్తే రేపటి రోజున జైలు శిక్షను కూడా ఇంట్లో ఉండి ఆన్‌లైన్ ద్వారా అనుభవిస్తామనే ప్రమాదం ఉందని వ్యాఖ్యానించింది. ముందస్తు బెయిలు కోసం సునీల్ నాయక్ దాఖలు చేసిన పిటిషన్ విచారణార్హతపై హైకోర్టులో వాదనలు ముగిశాయి. ఏప్రిల్ 6న తగిన నిర్ణయం వెల్లడిస్తామని న్యాయమూర్తి తెలిపారు. ఈ లోపు సునీల్ నాయక్‌పై కఠిన చర్యలేమి తీసుకోకుండా దర్యాప్తు జరపవచ్చని ఐవోకు సూచించారు. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ఈ మేరకు ఉత్తర్వులిచ్చారు.చట్టప్రకారం చెల్లదని వెల్లడి: రఘురామను కస్టోడియల్ టార్చర్‌కు గురిచేసిన కేసులో నిందితుడు, అప్పటి సీఐడీ డీఐజీ సునీల్ నాయక్ ముందస్తు బెయిలు కోసం హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై విచారణ జరుపుతున్న హైకోర్టు ఐవో ముందు హాజరుకావాలని ఆయనను ఆదేశించింది. తాజాగా జరిగిన విచారణలో సునీల్ నాయక్ తరఫున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదనలు వినిపించారు. పట్నా వెళ్లిన ఏపీ పోలీసులు అక్రమంగా పిటిషనర్‌ను అదుపులోకి తీసుకున్నారన్నారు.



వారంట్ లేకుండా అరెస్ట్ చేయడానికి వెళ్లారని, స్థానిక పోలీసు స్టేషన్‌లో సమాచారం ఇవ్వలేదన్నారు. పోలీసులు నిబంధనలు పాటించలేదుకాబట్టి పట్నా మెజిస్ట్రేట్ ట్రాన్సిట్ రిమాండ్ ఇచ్చేందుకు నిరాకరించారని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. పిటిషనర్ అరెస్ట్ చట్టప్రకారం చెల్లదన్నారు.అభ్యర్థనను నిరాకరించిన న్యాయమూర్తి: ఈ నేపథ్యంలోనే ఏపీకి వచ్చి ముందస్తు బెయిలు పిటిషన్ దాఖలుచేశారని న్యాయవాది పేర్కొన్నారు. ఈ పిటిషన్‌కు విచారణార్హత ఉందని అన్నారు. పిటిషనర్ తరఫున మరో న్యాయవాది ఎన్. అశ్వనీకుమార్ బదులిస్తూ వాదనలు వినిపించారు. కోర్టు ఆదేశాల నేపథ్యంలో 23వ తేదీ విచారణకు సునీల్ నాయక్ ఐవో ముందు హాజరయ్యారని వివరించారు. పిటిషనర్ బీహార్ రాష్ట్రంలో అగ్నిమాపకశాఖ అదనపు డీజీగా పనిచేస్తున్నారని గుర్తు చేశారు. ఆ శాఖ డీజీ సెలవులో ఉండటంతో పిటిషనర్ ఇంఛార్జ్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో ఐవో ముందు హాజరుకు మినహాయింపునిచ్చి ఆన్‌లైన్ ద్వారా విచారణకు హాజరయ్యే వెసులుబాటు ఇవ్వాలని కోరారు. అందుకు న్యాయమూర్తి నిరాకరించారు.పోలీసుల తరఫున న్యాయవాదుల వాదనలిలా! పోలీసుల తరఫున సీనియర్ న్యాయవాదులు సిద్ధార్థ అగర్వాల్, పోసాని వెంకటేశ్వర్లు, పీపీ ఎం.లక్ష్మీనారాయణ వాదనలు వినిపించారు. సునీల్ నాయక్‌పై నమోదైంది హత్యాయత్నం(ఐపీసీ 307), తదితర తీవ్రమైన సెక్షన్లని వాదనలు వినిపించారు. ఈ నేపథ్యంలో ఆయన అరెస్ట్‌కు కోర్టు నుంచి వారంట్ తీసుకోవాల్సిన అవసరం లేదన్నారు. సునీల్ నాయక్‌ను పట్నాలో ఇప్పటికే అరెస్ట్ చేశామని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. ఒకసారి అరెస్ట్ అయ్యాక ముందస్తు బెయిలు పిటిషన్ దాఖలు చేయడానికి వీల్లేదన్నారు. ఈ పిటిషన్‌కు విచారణార్హత లేదని పట్నాలో సునీల్ నాయక్‌ను అరెస్ట్ చేసే సమయంలో చట్ట నిబంధనలను పాటించామని వెల్లడించారు.పిటిషన్ వేయడానికి వీల్లేదని స్పష్టం: అరెస్ట్‌కు గల కారణాలను రాతపూర్వకంగా సునీల్ నాయక్‌కు అందజేశామని పేర్కొన్నారు. వాటిపై ఆయన సంతకం చేశారని కోర్టుకు తెలిపారు. కుటుంబ సభ్యులకు అరెస్ట్ సమాచారం ఇచ్చామన్నారు. కోర్టులో హాజరుపరిచాక పట్నా కోర్టు ట్రాన్సిట్ రిమాండ్ ఇవ్వడానికి నిరాకరించిందని గుర్తు చేశారు. అంతే తప్ప తాము చేసిన అరెస్ట్ చట్ట విరుద్ధమని చెప్పలేదని కోర్టుకు తెలిపారు. ఏపీలోని న్యాయస్థానాలను ఆశ్రయిస్తానని సునీల్ నాయక్ అఫిడవిట్ రూపంలో పట్నా కోర్టుకు హామీ ఇవ్వడంతో విడుదల చేసిందని అన్నారు. నిందితుడ్ని ఒకసారి అరెస్ట్ చేశాక రెగ్యులర్ బెయిలు పిటిషన్ దాఖలు చేసుకోవాలి తప్ప, ముందస్తు బెయిలు పిటిషన్ వేయడానికి వీల్లేదని స్పష్టం చేశారు.పిటిషన్‌ను కొట్టేయండి, కోర్టు నిర్ణయం వెల్లడించేత వరకు ఐవో కోరినప్పుడు విచారణకు హాజరయ్యేలా సునీల్ నాయక్‌ను ఆదేశించాలని కోరారు. పిటిషనర్‌పై కస్టోడియల్ టార్చర్ వంటి తీవ్రమైన ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో ఐవో ముందు హాజరు నుంచి మినహాయింపు ఇవ్వొద్దని ఈ సందర్భంగా కోరారు.

# హైదరాబాద్ లో పలు బంకుల్లో పెట్రోల్ లేదని బోర్డులు

**రిఫైనరీల నుంచి ఇంధన సరఫరా సక్రమంగా జరుగుతోందన్న పౌరసరఫరాలశాఖ**

**- వదంతుల వల్లే ఫిల్లింగ్ స్టేషన్ల వద్ద క్యూలైన్లు పెరిగాయని వెల్లడి**

**- ప్రజలు భయపడి అనవసర కొనుగోలు చేస్తున్నారని వ్యాఖ్య**

హైదరాబాద్ పరిధిలో పలు బంకుల్లో పెట్రోల్ లేదని బోర్డులు దర్శనమిస్తున్నాయి. రంగారెడ్డి జిల్లా అంబర్‌పేటలోని పలు ప్రాంతాల్లో పెట్రోల్ బంకులు మూతపడ్డాయి. అంబర్‌పేటలోని పలు పెట్రోల్ బంకుల్లో ఓన్లీ డిజైన్, పెట్రోల్ లేదని బోర్డు దర్శనమిచ్చాయి. గ్యాస్ ఫిల్లింగ్ సెంటర్ల దగ్గర ఆటో డ్రైవర్ల నిరీక్షణ చేశారు. గ్యాస్ ఫిల్లింగ్ సెంటర్ నిర్వహకులు గ్యాస్ ఎప్పుడు వస్తుందో తమకు తెలియదని, గ్యాస్ వచ్చినప్పుడు ఫిల్ చేస్తామని చెప్తున్నారు. ఇల్లు గడవడం లేదంటూ ఆటో డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కిలో మీటర్ మేర ఆటోల లైన్ : పాతబస్తీలో అనేక పెట్రోల్ పంపులు, గ్యాస్ పంపులు మూసివేయబడ్డాయి. పెట్రోల్, గ్యాస్ పంపులపై ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. గ్యాస్ కోసం 8 గంటలుగా ఆటో డ్రైవర్లు ఎదురుచూస్తున్నారు. హైదరాబాద్ పాతబస్తీ బహదూర్‌పురా, మీర్ అలం, హస్సన్ నగర్, చంపాపేట్, సంతోష్ నగర్ ప్రాంతాల్లోని పలు పెట్రోల్ బంకులు బంద్ అయ్యాయి. పెట్రోల్ లేదు అనే బోర్డులు దర్శనమిస్తున్నాయి. పెట్రోల్ దొరకదన్న పుకార్లతో పాతబస్తీలో చాలాచోట్ల క్యాన్లలో తీసుకెళ్లడం కనిపించింది. గ్యాస్ ఫిల్లింగ్ సెంటర్ల దగ్గర కిలో మీటర్ మేర ఆటోల లైన్ ఉంది.

ఈ ఘటనలపై తెలంగాణ ప్రభుత్వ పౌరసరఫరాల శాఖ స్పందించింది. తెలంగాణ రాష్ట్రంలో ఎక్కడా పెట్రోల్, డీజిల్ లేదా వంట గ్యాస్ – ఎల్‌పీజీ కొరత ఏ మాత్రం లేదని పౌర సరఫరాల శాఖ స్పష్టం చేస్తోంది. అన్ని ఆయిల్ రిఫైనరీల నుంచి స్థానిక డిపోల వరకు ఇంధన సరఫరా యంత్రాంగం పూర్తిగా, సక్రమంగా పని చేస్తోంది. అన్ని జిల్లాల్లోని ప్రజల రోజువారీ అవసరాలను తీర్చడానికి సరిపడా ఇంధన నిల్వలు అందుబాటులో ఉన్నాయి. కొన్ని పెట్రోల్ బంకుల్లో పొడవైన క్యూలు, తాత్కాలికంగా "నో స్టాక్" బోర్డులు కనిపించడానికి ప్రధాన కారణం తప్పుడు వదంతుల వల్ల ప్రజలు భయపడి అకస్మాత్తుగా ఇంధనం కొనుగోలు చేయడానికి ఎగబడటమేనని పౌరసరఫరాల శాఖ స్పష్టం చేసింది.

డీలర్లకు చిన్నపాటి తాత్కాలిక సమస్యలు : డిపోల్లో తగినంత ఇంధనం ఉన్నప్పటికీ, ప్రజలు అనవసరంగా తమ వాహనాల ట్యాంకులు పూర్తిగా నింపుకోవడానికి పరుగులు తీయడం వల్లే ఈ కృత్రిమ కొరత ఏర్పడుతోందని ప్రభుత్వ పౌర సరఫరాల శాఖ ప్రస్తావించింది. అంతే కాకుండా, ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు (ఓఎంసీలు) ముందస్తు చెల్లింపు విధానాల్లో మాత్రమే చేసిన కొన్ని మార్పుల వల్ల స్థానిక డీలర్లకు చిన్నపాటి తాత్కాలిక సమస్యలు ఎదురయ్యాయి. ఇది కేవలం అంతర్గత పరిపాలన పరమైన విషయం మాత్రమే తప్ప సరఫరాలో ఏం లోపం కాదని పేర్కొంది. ఈ మేరకు పౌరసరఫరాల శాఖ ఓ ప్రకటన విడుదల చేసింది.

అక్రమాలపై ఫిర్యాదు చేయాలి : ఈ పరిస్థితి చక్కదిద్ది అందరికీ సమానంగా ఇంధనం అందేలా చూడటానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, పెట్రోలియం సంస్థలు, పోలీసు శాఖతో కలిసి పెట్రోల్ బంకులను నిరంతరం పర్యవేక్షిస్తోంది. ఇంధనం అక్రమంగా నిల్వ చేసినా, బ్లాక్ మార్కెట్ చేసినా లేదా గృహ అవసరాలకు వాడే గ్యాస్ సిలిండర్లు వాణిజ్య – కమర్షియల్ అవసరాలకు అక్రమంగా మళ్లించినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. ప్రజలందరూ ప్రశాంతంగా ఉండాలని, భయాందోళనలతో అనవసరంగా ఇంధనం కొనుగోలు చేయవద్దని ప్రభుత్వం కోరుతోంది. దయచేసి ప్రభుత్వ అధికారిక ప్రకటనలు మాత్రమే నమ్మండని, సామాజిక మాధ్యమాల్లో వచ్చే తప్పుడు వదంతులను నమ్మవద్దని, అవి ఇతరులకు పంపవద్దని ఫార్వర్డ్ చేయవద్దని సూచించింది. ఏవైనా సందేహాలు ఉన్నా లేదా అక్రమాలపై ఫిర్యాదు చేయాలన్నా ప్రజలు పౌర సరఫరాల శాఖ టోల్ ఫ్రీ హెల్ప్ లైన్ నంబర్ 1967 సంప్రదించగలరని ఆ శాఖ అధికారులు వెల్లడించారు.




# కుమార్తెను వదిలేసి భార్యను చంపేశాడు

**- షాద్‌నగర్ హత్య కేసులో భర్తే నిందితుడు**

**- రాత్రంతా తల్లి శవం వద్దే ఉన్న కూతురు**

**- పోలీసులకు ఫిర్యాదు చేసిన మృతురాలి తల్లి**

**- దర్యాప్తు అనంతరం నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు**



కట్టుకున్న భార్య మీద అనుమానంతో భర్త బండరాయితో కర్కశంగా చంపేశాడు. అర్ధరాత్రి సమయంలో సొంతూరుకు దూరంగా శవాన్ని పడేశాడు. మూడేళ్ల సొంత కూతుర్ని తల్లి మృతదేహం వద్దే నిర్దాక్షిణ్యంగా వదిలేశాడు. అభంశుభం తెలియని ఆ చిన్నారి ఇక అమ్మ లేదన్న విషయం తెలియక తెల్లారే వరకూ తల్లి శవం వద్దే గుక్కపట్టి ఏడ్చింది. ఉదయం చుట్టుపక్కల వారంతా పాప ఏడుపు వినటంతో ఈ హత్యోదంతం వెలుగులోకి వచ్చింది. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా ఫరూక్ నగర్ మండలం రంగారెడ్డి గూడలో సంచలనం రేపింది.

అనుమానంతో అంతమొందిచాలని నిర్ణయం : పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రంగారెడ్డి గూడకు చెందిన శోభ, మహబూబ్‌నగర్ జిల్లా కోయల్ కొండకు చెందిన రాజు ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. ఇద్దరికీ ఒక కుమారుడు ఉన్నాడు. కొన్నాళ్ల తర్వాత ఇద్దరి మధ్య మనస్పర్థాలు రావటంతో రాజుతో శోభ విడిపోయింది. అనంతరం అదే గ్రామానికి చెందిన పానుగంటి నర్సింహులును కూడా ప్రేమించి పెళ్లి చేసుకుంది. వీరిద్దరికీ మూడేళ్ల కూతురు ఉంది. ఆ తర్వాత నర్సింహులు తోనూ ఆమెకు విబేధాలొచ్చాయి. దీంతో రంగారెడ్డిగూడలోని తన తల్లిగారింటికి వచ్చి ఉంటోంది. మొదటి భర్త కుమారుడు, రెండో భర్త కూతురు ఇద్దరూ శోభతోనే ఉంటున్నారు. తిరిగి ఇంటికి రావాలని నర్సింహులు ఎన్నిసార్లు కోరినా శోభ నిరాకరించింది. దీంతో నర్సింహులు ఇతరులతో చనువుగా ఉంటోందని శోభపై అనుమానం పెంచుకున్నాడు. ఎలాగైనా శోభను అంతమొందించాలని నిర్ణయించుకున్నాడు.

హత్య ఎలా జరిగింది? : ఈ నెల 21న కుమారుడికి సైకిల్ కొనిస్తానని భార్యను పిలిపించాడు. కొడుకును తల్లిగారింటి వద్దే వదిలేసి కూతురుతో కలిసి శోభ మహబూబ్‌నగర్ చేరుకుంది. భార్యను, కూతుర్నిని తాను అద్దెకు ఉంటున్న ఇంటికి తీసుకెళ్లాడు. ఇద్దరూ మద్యం తాగారు. ఈ క్రమంలోనే కూతురు విషయంలో గొడవ పడ్డారు. ముందుగా ప్రణాళిక వేసుకున్న నర్సింహులు శోభను బండరాయితో తలపై బలంగా మోది చంపేశాడు. ఆమె మరణించినట్లు నిర్ధారించుకున్నాక గది బయట ఉన్న రక్తపు ఆనవాళ్లను శుభ్రం చేశాడు. రక్తంతో తడిసిన దుస్తులను ప్లాస్టిక్ కవర్‌లో దాచిపెట్టాడు. రాత్రి వరకు గదిలోనే ఉండి ఎవరూ చూడకుండా వేచి చూశాడు. అర్ధరాత్రి సమయంలో శవాన్ని మెట్లపై నుంచి కిందకు దించి మూట కట్టి బైక్ పెట్రోల్ ట్యాంక్ పై పెట్టుకున్నాడు. మూటపై తన మూడేళ్ల కూతుర్ని కూర్చోబెట్టుకున్నాడు. సుమారు 50కిలో మీటర్ల మేర మృతదేహాన్ని బైక్‌పై తరలించి, రంగారెడ్డి గూడెం సమీపంలో పొలం వద్ద శవాన్ని పడేశాడు. మూడేళ్ల కూతురుని కూడా మృతదేహం వద్దే వదిలేశాడు.

ఘటన వెలుగులోకి వచ్చింది ఇలా : కూతురు ఏడుపుతో 22న ఉదయం శోభ హత్య వెలుగులోకి వచ్చింది. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. నర్సింహులే తన బిడ్డను చంపి ఉంటాడన్న తల్లి అనుమానంతో ఆ దిశగా పోలీసులు దర్యాప్తు చేశారు. సెల్‌ఫోన్ సిగ్నల్ ఆధారంగా నర్సింహులు కోసం గాలించారు. చివరకు లింగంపల్లిలోని తన అక్క ఇంటి వద్ద ఉన్నాడని తేల్చుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని అదుపులోకి తీసుకున్నారు. కస్టడీలోకి తీసుకుని విచారించగా చేసిన నేరాన్ని ఒప్పుకున్నాడు. నిందితుడి నుంచి సెల్ ఫోన్, హత్యకు వినియోగించిన బండరాయి, నిందితుడు దాచిన చొక్కా ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

"షాద్‌నగర్ పట్టణా పోలీస్ స్టేషన్ పరిధిలో 22న ఉదయం తన కూతురును హత్య చేశారని మృతురాలి తల్లి ఫిర్యాదు చేసింది. పట్టణ సీఐ గారు హత్య, వరకట్నం వేధింపుల కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. దాంట్లో భాగంగానే తన సొంత భర్తనే శోభను హంతమొందిచాడన్న విషయం బయటపడింది." – లక్ష్మీనారాయణ, షాద్‌నగర్ ఏసీపీ

# ఒకప్పుడు ఆమెకు అడవే లోకం - ఇప్పుడు ఊరికి ఆమే ఆధారం

**గిరిజనులకు వలలు, బోట్లు ఇప్పించడంలో కీలక భూమిక**

**- లింగమ్మ కృషిని గుర్తించిన ఇండియన్ స్కూల్ ఆఫ్ డెమొక్రసీ సంస్థ**

**- మహిళా దినోత్సవ కార్యక్రమంలో జాతీయ అవార్డు ప్రదానం**



ఒకప్పుడు ఆమె అడవే లోకంగా బతికిన సాధారణ గిరిజన చెంచు మహిళ. వెట్టికి పనిచేస్తూ, దుర్భర జీవితాన్ని అనుభవించిన కూలీ. ఇప్పుడు ఆమె గ్రామానికి సర్పంచ్. నిర్బంధ కూలీ నుంచి సర్పంచ్‌గా ఆమె ప్రయాణాన్ని చూసి ఇండియన్ స్కూల్ ఆఫ్ డెమొక్రసీ సంస్థ తాజాగా దిల్లీలో నిర్వహించిన మహిళా దినోత్సవ కార్యక్రమంలో జాతీయ అవార్డు ప్రదానం చేసింది. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం అమరగిరి సర్పంచ్ పురుసాల లింగమ్మ విజయగాథపై ప్రత్యేక కథనం.

దుంపలు తిని, మంచినీళ్లు తాగి జీవనం : ఇక్కడ కనిపిస్తున్న మహిళ పేరు పురుసాల లింగమ్మ. నాగర్ కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం అమరగిరి గ్రామ సర్పంచ్. కానీ ఏళ్లుగా ఆమె అనుభవించింది మాత్రం సాధారణ గిరిజన మహిళలు అనుభవించిన దుర్భర జీవితమే. నిత్యం అడవిలోకి వెళ్లి బంక, తేనే, కుంకుడు కాయలు, దుంపల్లాంటివి సేకరించి సంతల్లో అమ్ముకుని జీవనం సాగించేది. అటవీ ఉత్పత్తులు దొరకకుంటే దుంపలు తిని, మంచి నీళ్లు తాగి కడుపు నింపుకోవాల్సిందే.

30 ఏళ్లు వెట్టిచాకిరీలోనే : శ్రీశైలం ప్రాజెక్ట్ నిర్మించడంతో మత్స్య సంపద పెరిగి చేపల వేట గిరిజనుల వృత్తిగా మారిపోయింది. భూముల్లేవు, వ్యవసాయం లేదు. వేట తప్ప మరో ఉపాధి లేదు. అప్పటికే లింగమ్మకు పెళ్లైంది, పిల్లలున్నారు. దీంతో ఆమెకు కుటుంబ పోషణ భారమైంది. చేపల వేట కోసం దళారులను ఆశ్రయించాల్సి వచ్చింది. దళారులు అప్పు కింద వలలు ఇచ్చేవారు. వారానికోసారి బియ్యం, ఇతర సరుకులు అందించి వేటకు వెళ్లమనేవారు. తీరం వెంట గుడిసెలు వేసుకుని అక్కడే ఉండి చెంచులు చేపలు పట్టేవాళ్లు. పట్టిన చేపలను దళారులు తీసుకెళ్లేవారు. కూలీ కూడా ఇచ్చేవారు కాదు. ఇచ్చిన వలల ఖరీదు ఎక్కువంటూ అప్పు తీరే వరకూ పని చేయాల్సిందేనని ఆదేశించే వారు. అలా 30 ఏళ్లు వెట్టిచాకిరీలోనే లింగమ్మ జీవితం గడిచిపోయింది.

"నేనేం చదువుకోలేదు. అటవీ ఉత్పత్తులు తింటూనే జీవనం సాగించే వాళ్లం. అవేం దొరక్కుంటే నీరు తాగి కడుపు నింపుకునేవాళ్లం. దళారులు అప్పివ్వడం, మేము వాళ్ల కింద పనిచేయడం ఇదే జరిగేది. వాళ్లు ఎంతిస్తే అంతే తీసుకునే వాళ్లం. మేము వారం మొత్తం చేపలు పట్టినా చేతికి మాత్రం రూ.500 ఇచ్చేవారు." – పురుసాల లింగమ్మ, అమరిగిరి సర్పంచ్

వెట్టిచాకిరి నుంచి విముక్తి : 2016లో స్వచ్ఛంద సంస్థల చొరవతో ఉన్నతాధికారులు వారికి వెట్టిచాకిరీ నుంచి విముక్తి కల్పించారు. ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థల సహకారంతో గిరిజనులకు వలలు, బోట్లు, వాహనాలు ఇప్పించడంలో లింగమ్మ కీలక భూమిక పోషించారు. ఇప్పుడు గిరిజనులే సొంతంగా చేపలు పట్టి, అమ్మి లాభాలు గడిస్తున్నారు. గిరిజనుల పక్షాన కొట్లాడి, వారి జీవితాల్ని మెరుగుపరిచిన లింగమ్మను పొదుపు సంఘానికి అధ్యక్షురాలిని చేశారు. ఆ తర్వాత మండల సమాఖ్యకు సైతం కోశాధికారిగా ఆమె ప్రాతినిధ్యం వహించారు.

"ఇన్నాళ్లూ వెట్టిచాకిరీలోనే జీవితం గడిచిపోయింది. కనీసం సంపాదన లేదు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఈ విషయంలో ప్రభుత్వం మాకు సహకరించింది. మూడు బోట్లు, ఓ వాహనం, వలలు అందించి, చేపల కంపెనీని ఏర్పాటు చేసింది. దీంతో మేమే సొంతంగా చేపలను హైదరాబాద్ వరకు తీసుకెళ్లి విక్రయిస్తున్నాం." – పురుసాల లింగమ్మ, అమరిగిరి సర్పంచ్

జాతీయ అవార్డు ప్రదానం : ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో లింగమ్మ సొంత తమ్ముడి మీదే పోటీ పడి గెలిచారు. చెంచులకు ఇళ్లు నిర్మించడంలో, చేపల కంపెనీ ఏర్పాటుకు కృషి చేసినందుకు లింగమ్మను గ్రామస్థులు ప్రజాప్రతినిధిగా గెలిపించారు. లేబర్ నుంచి గ్రామ సర్పంచ్‌గా లింగమ్మ చేసిన ప్రయాణం, గిరిజనుల తరఫున ఆమె జరిపిన పోరాటాన్ని గురించి తెలుసుకున్న ఇండియన్ స్కూల్ ఆఫ్ డెమొక్రసీ సంస్థ దిల్లీలో నిర్వహించిన మహిళా దినోత్సవ కార్యక్రమంలో జాతీయ అవార్డును ప్రకటించింది. అవార్డు అందుకోవడం పట్ల లింగమ్మ సంతోషం వ్యక్తం చేశారు. తనలాగా తన గ్రామానికి చెందిన గిరిజనులు, చెంచులు దుర్భర జీవితం అనుభవించకూడదని, ఉన్నత చదువులు చదివి ఉద్యోగాల్లో స్థిరపడాలని కోరుకుంటోంది.

ఆమె జీవితం ఒక స్ఫూర్తి : అడవే లోకంగా, సమాజానికి దూరంగా, చదువు లేకుండా ఇప్పటికీ దుర్భర జీవితాలు గడుపుతున్న గిరిజన, చెంచు మహిళలకు పురుసాల లింగమ్మ జీవితం ఒక స్ఫూర్తి. అవకాశాల్ని అందిపుచ్చుకుంటే ఎవరి జీవితంలోనైనా ఎదుగుదల సాధ్యమని చెప్పేందుకు లింగమ్మ ఓ నిదర్శనం.

PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI S HARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI . TELTEL/2021/81092 : PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com